వృద్ధుల కోసం కేటాయించిన భూమిలో విల్లాల నిర్మాణం



హయగ్రీవ

ఆసాంతం వివాదాలమయం

వృద్ధాశ్రమంతోపాటు వృద్ధుల కోసం ఇళ్లు నిర్మించేందుకు 2008లో ఎండాడలో 12.51 ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం

- పదిహేనేళ్లపాటు ముందుకుసాగని ప్రాజెక్టు
- అధికారం అడ్డంపెట్టుకుని తన నుంచి బలవంతంగా ప్రాజెక్టును ఎంపీ ఎంవీవీ లాక్కున్నారంటూ రెండేళ్ల కిందట సెల్ఫీ వీడియో విడుదల చేసిన హయగ్రీవ ఫామ్స్ ఎండీ జగదీశ్వరుడు
- ఆశ్రమం నిర్మించకుండానే ఫ్లాట్లుగా విభజించి విక్రయం
- ఆ భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలంటూ సీసీఎల్ఏకు లేఖ రాసిన నాటి జిల్లా కలెక్టర్
- వివాదాన్ని పక్కనపెట్టి భవన నిర్మాణాలకు ప్లాన్ జారీచేసిన జీవీఎంసీ ప్రస్తుత కమిషనర్
- దీనిపై హైకోర్టులో పిల్ దాఖలు చేసిన జనసేన, టీడీపీ నేతలు
- తుదితీర్పునకు లోబడి ఉండేలా పనులు చేసుకునేందుకు హైకోర్టు అనుమతి

- దాంతో ఆ భూమిలో శరవేగంగా విల్లాల నిర్మాణం
- తన భూమిని ఎంపీ సహా మరో ముగ్గురు కబ్జా చేశారంటూ తాజాగా ఆరిలోవ పోలీసులకు జగదీశ్వరుడు ఫిర్యాదు
- ముగ్గురిపై పలుసెక్షన్ల కింద కేసులు నమోదు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో 'హయగ్రీవ' ప్రాజెక్టు మరోమారు వార్తల్లో నిలిచింది. గతంలో ప్రభుత్వం కేటాయించిన భూమిని వైసీపీ నేతలు తన నుంచి బలవంతంగా లాక్కొన్నారని ఆరోపిస్తూ సంస్థ ఎండీగా ఉన్న చెరుకూరి జగదీశ్వరుడు అలియాస్ జగదీశ్ రెండేళ్ల కిందట సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అదే జగదీశ్వరుడు తన భూమిని మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆయన స్నేహితుడు ఆడిటర్ అయిన జీవీతోపాటు మరొకరు కబ్జా చేశారంటూ రెండు రోజుల క్రితం ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేయడం, ముగ్గురిపై కేసులు నమోదుచేయడంతో మరోసారి హయగ్రీవ ప్రాజెక్టు వివాదం తెరపైకి వచ్చింది.

విశాఖలో వృద్ధుల కోసం ఉచితంగా ఆశ్రమం నిర్మించి నిర్వహించడంతోపాటు వృద్ధులకు అన్ని సదుపాయాలతో విల్లాలు నిర్మించి వారికి అందుబాటు ధరకు విక్రయిస్తానని, నామమాత్రపు ధరకు భూమిని కేటాయించాలని హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్ సంస్థ ఎండీ చెరుకూరి జగదీశ్వరుడు 2006లో రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం 2008లో ఎండాడ సర్వే నంబరు 92/3లో 12.51 ఎకరాలను హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించింది. అందులో పది శాతం విస్తీర్ణంలో వృద్ధులకు ఉచితంగా ఆశ్రమం నిర్మించి నిర్వహించడంతోపాటు 30 శాతం భూమిలో రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు నిర్మించాలని, మిగిలిన 60 శాతం భూమిలో వృద్ధులకు నివాసయోగ్యంగా ఉండేలా విల్లాలు నిర్మించి వారికి మాత్రమే తక్కువ ధరకు విక్రయించాలని ప్రభుత్వం షరతు విధించింది. షరతులకు లోబడి ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని జగదీశ్వరుడు చెల్లించడంతో 2010లో ఆ భూమిని హయగ్రీవ సంస్థకు రిజిస్ట్రేషన్ చేసింది. భూ కేటాయింపు జరిగిన తర్వాత వివిధ కారణాలతో 2020 వరకూ ఆయన నిర్మాణ పనులు ప్రారంభించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆ భూమి అభివృద్ధి (డెవలప్‌మెంట్)కి సంబంధించి వైసీపీ నేత, అప్పటి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జీవీఎంసీ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), గాదె బ్రహ్మాజీలతో హయగ్రీవ సంస్థ ఎండీ జగదీశ్వరుడుకు నడుమ అగ్రిమెంట్ జరిగింది. అయితే అధికారాన్ని అడ్డం పెట్టుకుని

... మిగతా 6వ పేజీలో

రాజీనామా యోచనలో ఏయూ వీసీ?



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

కుర్చీని వీడకుంటే గతంలో వ్యవహారాలు ఎక్కడ వెలికితీస్తారోనని ఆందోళన

- ఆయన బాటలోనే మరో కీలక అధికారి
- గడచిన ఐదేళ్లు వర్సిటీని వైసీపీ కార్యాలయంగా మార్చారని ఉప కులపతిపై విమర్శలు
- క్యాంపస్‌లో వైసీపీ పెద్దల జన్మదిన వేడుకలు నిర్వహణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి కుర్చీ దిగిపోయే సమయం ఆసన్నమైందంటున్నారు. రాజీనామా చేయాలని ఆయన యోచిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. కుర్చీని వీడకుంటే క్రిమినల్ కేసులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని, అందుకే ముందుగానే తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారు, పదవీ విరమణ తరువాత కూడా కొనసాగుతున్న ఉన్నతాధికారులు ఒక్కొక్కరుగా రాజీనామాలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పైరవీలు చేసి కొందరు విశ్వవిద్యాలయాల్లో కీలక పోస్టుల్లో తిష్ఠ వేశారు. వైసీపీకి అనుకూలంగా పనిచేశారు. ఎన్నికల సమయంలో కూడా ఆ పార్టీ విజయం కోసం సర్వశక్తులూ వినియోగించారు. అటువంటి వారి జాబితాలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి ప్రథమ స్థానంలో ఉన్నారు. ఆయన యూనివర్సిటీని ఏకంగా వైసీపీ కార్యాలయంగా మార్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల ముందు ఆ పార్టీ జయాపజయాలపై విద్యార్థులతో సర్వేలు చేయించడం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. యూనివర్సిటీ వేసిన ప్రతి అడుగులో వైసీపీ ఉందనేటట్టుగా ప్రచారం చేశారు. తన ఎజెండాను అమలు చేయడం కోసం కీలక పోస్టుల్లో అనుకూలురైన వారిని నియమించుకున్నారు. అంతా కలిసి నచ్చినట్టు చేశారు. తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులను, ఆ పార్టీకి చెందిన కుటుంబ సభ్యులను వేధించారు. ఒకటేమిటి?...ఏయూలో ఏకంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటు చేయించారు.

ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా విజయసాయిరెడ్డి ఉన్నప్పుడు జీవీఎంసీ ఎన్నికల్లో ప్రసాదరెడ్డే చక్రం తిప్పారు. అభ్యర్థుల ఎంపిక అంతా ఆయన చేతుల మీదుగానే జరిగింది. నామినేటెడ్ పోస్టులు కూడా ఆయన చెప్పిన వారికే ఇచ్చారు. మరోవైపు రాష్ట్రంలో వైసీపీకి చెందిన వారిని ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి రప్పించి వారికి అడ్డదారిలో పీహెచ్‌డీ పట్టాలు ఇప్పించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇక వర్సిటీలో నిర్మాణాల పేరుతో భారీగా నిధులు ఖర్చు చేశారు. వైసీపీ అండ చూసుకొని టీడీపీ నేతలపైనే నేరుగా విమర్శలు చేసి అందరి దృష్టిలో పడ్డారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలుకావడం, కూటమి ప్రభుత్వం ఏర్పాటవ్వడంతో ఆ పదవిలో కొనసాగాలా?, లేక తప్పుకుంటే మంచిదా?...అని డోలాయమానంలో పడ్డారని విశ్వసనీయంగా తెలిసింది. ఆ సీట్లో కూర్చున్నా పాత వ్యవహారాలు అన్నీ తిరగదోడి క్రిమినల్ కేసులు పెట్టే అవకాశం ఉందని, పైగా అవమానాలు కూడా ఎదుర్కొనాల్సి వస్తుందనే ఉద్దేశంతో రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్టు మంగళవారం రాత్రి తెలిసింది. ఆయనతో పాటు రిజిస్ట్రార్‌ను కూడా రాజీనామా చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

8 మంది ట్రెజరీ ఉద్యోగులకు షోకాజ్

- సక్రమంగా విధులకు హాజరుకాకపోవడమే కారణం

- వార్త I పేజీలో

లీజుకు ఉక్కు వెల్‌నెస్ సెంటర్!

ప్రకటన జారీ చేసిన యాజమాన్యం



సెక్టార్-6లోని వెల్‌నెస్ సెంటర్

- ఏప్రిల్‌లో ఉక్కు క్లబ్‌హౌస్, గంగవరం పోర్టు గెస్ట్‌హౌస్ లీజుకు ఇస్తామంటూ ప్రకటన
- వారం క్రితం హైదరాబాద్, చెన్నై యార్డుల అమ్మకం ప్రకటన
- నిరర్థక ఆస్తుల పేరుతో నాటకం
- ఉద్యోగులు, కార్మికుల్లో ఆగ్రహం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటును వీలైనంత త్వరగా నిర్వీర్యం చేయాలని ప్రస్తుత యాజమాన్యం ప్రయత్నిస్తోంది. ఇప్పుడు ఉన్న సీఎండీ పదవీ కాలం ఈ ఏడాది నవంబరుతో ముగిసిపోతుంది. రెండున్నరేళ్ల క్రితం వచ్చిన ఇక్కడకు వచ్చిన ఆయన అంతా సహకరిస్తే ఏటా నాలుగు మిలియన్ టన్నుల స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్న ప్లాంటును పూర్తిస్థాయిలో పనిచేసేలా అంటే 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో పనిచేయిస్తానని ప్రకటించారు. కానీ ఆ దిశగా ఎటువంటి ప్రయత్నాలు జరగలేదు. పైగా నిరర్థక ఆస్తుల పేరుతో విలువైన స్థిరాస్తులను విక్రయించడం, కొన్నింటిని లీజుకు ఇవ్వడం చేశారు. రాయబరేలిలో ఫోర్జ్‌డ్ వీల్‌ప్లాంటును విక్రయించేశారు. విశాఖపట్నం హెచ్‌బీ కాలనీలో క్వార్టర్స్‌ను కూలగొట్టి ఆ స్థలాన్ని వేలంలో అమ్మేశారు. తాజాగా హైదరాబాద్, చెన్నైలలో ఉన్న స్టాక్ యార్డుల అమ్మకానికి ప్రకటన జారీచేశారు. రెండు నెలల క్రితం అంటే ఏప్రిల్‌లో వృథాగా ఉన్నాయంటూ విశాఖపట్నం ఉక్కు క్లబ్, గంగవరం పోర్టు గెస్ట్‌హౌస్‌లను లీజుకు ఇచ్చేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. గెస్ట్ హౌస్‌ను తీసుకోవడానికి ఎవరూ ముందుకురాలేదు. ఉక్కు క్లబ్‌కు మాత్రం కొందరు ఆసక్తి చూపించారు. దానిపై చర్చలు నడుస్తున్నాయి.

తాజాగా టౌన్‌షిప్‌లో ఉద్యోగుల కోసం ఐదేళ్ల క్రితం రూ.1.5 కోట్లతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను పదేళ్ల లీజుకు ఇవ్వడానికి ప్రకటన ఇచ్చారు. దీనిని ఐదు వేల చ.అ. విస్తీర్ణంలో నిర్మించారు. అందులో ఎక్సర్‌సైజులు చేసుకునే హాలు, ఏరోబిక్స్, యోగా హాలు, సెలూన్, స్పా, రెస్ట్ రూమ్‌లు ఉన్నాయి. దీనిని ఇప్పుడు పదేళ్ల కాలానికి లీజుకు ఇస్తామని ప్రకటించారు. నెలకు చ.అడుగుకు ఎంత ఇస్తారో, ఏ వ్యాపారం చేస్తారో

... మిగతా 6వ పేజీలో

కొనలేం, తినలేం

మండిపోతున్న కూరగాయల ధరలు

- రైతుబజార్‌లోనే కిలో రూ.40 దాటిన పలు రకాలు
- వంకాయలు రూ.44, టమాటా రూ.64, బరబాటి 54, బీన్స్ రూ.120 క్యాప్సికమ్ రూ.84, కాకర 48, బీరకాయలు 40
- బహిరంగ మార్కెట్‌లో మరో రూ.20 ఎక్కువకు విక్రయం



ఎం.వి.పి.కాలనీ, జూన్ 25:

నగరంలో కాయగూరల ధరలు మండిపోతున్నాయి. రైతుబజార్‌లో రెండు, మూడు రకాలు మినహా దాదాపు అన్నీ కిలో 40 రూపాయలపైనే ఉన్నాయి. అదే బహిరంగ మార్కెట్‌లో అయితే కిలోకు కనీసం రూ.20 పైగా బాదుతున్నారు. కూరగాయల ధరలను అదుపుచేసే యంత్రాంగమేదీ లేకపోవడంతో బయట ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ముఖ్యంగా బయట దుకాణాల్లో అధిక ధరకు విక్రయించడం వల్ల పేద, దిగువ మధ్యతరగతి వారు ఇబ్బంది పడుతున్నారు. కొందరు వారానికొకసారి రైతుబజార్‌కు వెళ్లి ఏడు రోజులకు సరిపడా కూరగాయలు తెచ్చుకుంటారు. కానీ పేద, దిగువ మధ్య తరగతివారు ఏరోజుకారోజు సమీపంలోని దుకాణంలో చొప్పున కొనుగోలు చేస్తుంటారు. ఒక్కోచోట పావు కిలోపైనే పది రూపాయల వరకూ అదనంగా తీసుకుంటున్నారు. దీంతో కొనుగోలుదారులపై భారీగా భారం పడుతోంది.

ఇంట్లో అరుదుగా వినియోగించే కాయగూరల ధరలు మంగళవారం ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో పరిశీలిస్తే... దొండ రూ.28, క్యాబేజీ రూ.30, బీట్ రూట్ రూ.32, క్యారెట్ రూ.38, బెండ రూ.34, వంకాయలు తెల్లవి 44, నల్లవి 54 రూపాయలు. అలాగే టమాటా రూ.64, బరబాటి 54

... మిగతా 6వ పేజీలో

ఇసుక కొరత

రాష్ట్రంలోని నదుల్లో తవ్వకాలపై నిషేధంతో తగ్గిన లభ్యత

- ప్రస్తుతం ఒడిశా నుంచి రాక
- డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో పెరిగిన ధర
- ఇసుకపై విధానపరంగా ఇంకా నిర్ణయం తీసుకోని కొత్త ప్రభుత్వం



లంకెలపాలెం డిపోలో ఉన్న ఇసుక నిల్వలు

విశాఖపట్నం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి):

నగరంలో ఇసుకకు కొరత ఏర్పడింది. రాష్ట్రంలో నదుల్లో ఇసుక తవ్వకాలపై ప్రస్తుతం నిషేధం ఉంది. మరోవైపు కొత్త ప్రభుత్వం ఇసుక విధానం ఇంకా ఖరారుకాలేదు. ఈ నేపథ్యంలో ఇసుక లభ్యం కాకపోవడంతో నిర్మాణాలు మందగించాయి. అత్యవసర పనుల కోసం నిర్మాణదారులు ఎక్కువ ధర చెల్లించి అడ్డదారిలో వస్తున్న ఇసుకను కొనుగోలు చేస్తున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఇసుక లభ్యత క్రమేపీ తగ్గుతూ వచ్చింది. ఫలితాల తరువాత మరింత తగ్గింది. అప్పటి వరకూ నదుల్లో అక్రమంగా ఇసుక తవ్విన కాంట్రాక్టర్లు ఆ తరువాత నిలిపివేశారు. దీంతో శ్రీకాకుళం, రాజమండ్రి నుంచి ఇసుక రవాణా తగ్గింది. మరోవైపు భవన నిర్మాణాలకు వేసవి కాలం సీజన్ కావడంతో వేల టన్నులు ఇసుక అవసరం పడింది. డిమాండ్‌కు తగినంత ఇసుక లభించకపోవడంతో ధర పెరిగిపోయింది. రెండు నెలల క్రితం వరకు రూ.850 నుంచి రూ.950 వరకు ఉండే టన్ను ఇసుక ప్రస్తుతం రూ.1,200 నుంచి రూ.1,300కు పెరిగింది. నాణ్యమైన ఇసుక అయితే టన్ను రూ.1500 పెడితే గానీ దొరకడం లేదు. నెల క్రితం 40 టన్నుల ఇసుక లారీ రూ.37 వేల నుంచి రూ.40 వేలకు దొరికేది. ప్రస్తుతం రూ.50 వేలుపై మాటేనని నిర్మాణదారులు వాపోతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇసుక ర్యాంపులు లేకపోవడంతో నగరంతోపాటు పరిసరాల్లో భవన నిర్మాణాలకు ఇటు శ్రీకాకుళం జిల్లా వంశధార, నాగావళి, అటు తూర్పు గోదావరి జిల్లా గోదావరి నుంచి ప్రభుత్వం గుర్తించిన రీచ్‌ల నుంచి ఇసుక రవాణా చేస్తూ వస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తొలుత ఇసుక ర్యాంపులు, డిపోలు మొత్తం ఏపీఎండీసీ ఆధీనంలో ఉండేవి. ఆ తరువాత ప్రైవేటు వ్యక్తులకు అప్పగించింది. అయితే కొంతమంది అవసరాల పేరిట బల్క్‌గా రీచ్‌లలో కొనుగోలు చేసి లారీల్లో నగరానికి తీసుకువచ్చి విక్రయించేవారు. అదేవిధంగా భవన నిర్మాణదారులు నేరుగా రీచ్‌ల నుంచి తెచ్చుకునేవారు. ఒడిశా నుంచి కూడా ఇసుక వస్తుండేది.

అయితే రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వం ఇసుక విధానంపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో శ్రీకాకుళం, రాజమండ్రి నుంచి అధికారికంగా ఇసుక రవాణా నిలిచిపోయింది. పర్మిట్ ఉండడంతో ఒడిశా నుంచి వచ్చే ఇసుకను మాత్రం గనుల శాఖ విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ, పోలీసులు, రవాణా శాఖ అధికారులు అనుమతిస్తున్నారు. దాంతోపాటు శ్రీకాకుళం జిల్లాలో నదుల్లో అనధికారికంగా తవ్వకాలు జరుపుతున్నవారు సమీపంలోని పొలాలు, తోటల్లో నిల్వ చేసి రాత్రిపూట లారీల్లో నగరానికి తరలిస్తున్నారు. ఈ విషయం అధికారుల దృష్టిలో ఉంది. అయితే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సింది పోయి భారీగా ముడుపులు తీసుకుంటున్నారు. దాంతో శ్రీకాకుళం నుంచి ఇసుక తరలించేవారు రేటు పెంచారు. ఇలా నగరంలో ఇసుక ధరలు పెరిగాయి. అయినా నిర్మాణాలను సరిపడా ఇసుక లభ్యత లేదని

... మిగతా 6వ పేజీలో

అగనంపూడి టోల్‌గేటు వద్ద కూటమి నేతల ఆందోళన

టోల్‌గేటు ఎత్తేయాల్సిందే...

- స్టాపర్లను తొలగించిన కార్యకర్తలు
- వాహనాల నుంచి ఫీజు వసూళ్లను అడ్డుకున్న వైనం
- నేడు చర్చిద్దామని ఎన్‌హెచ్ఏఐ అధికారుల హామీ



టోల్‌గేటు వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

అగనంపూడి, జూన్ 25:

నగర పరిధిలోని అగనంపూడి వద్ద నిబంధనలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న టోల్‌గేటును ఎత్తివేయాల్సిందేనని టీడీపీ, జనసేన నాయకులు, శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి టోల్‌గేటు వద్దకు పెద్దఎత్తున చేరుకుని ఆందోళనకు దిగారు. వాహనాలను నియంత్రించేందుకు వీలుగా ఏర్పాటుచేసిన స్టాపర్లను తొలగించేశారు. ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదంటూ వాహనాలను పంపించేశారు. టోల్‌గేటు కొనసాగింపునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా జీవీఎంసీ 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర మాట్లాడుతూ నగర పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా టోల్‌గేటును కొనసాగిస్తూ ప్రజలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తుండడంతో దానిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. హైకోర్టు ఉత్తర్వులతో 2019లో ఇక్కడి టోల్‌గేటును మూసివేశారని, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ తెరిచి, దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టోల్‌గేటు కొనసాగడానికి వీల్లేదన్నారు. సుమారు గంటకుపైగా ఆందోళన కొనసాగిస్తుండడంతో అక్కడి సిబ్బంది విషయాన్ని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వారు బుధవారం టోల్‌గేటు వద్దకు వచ్చి చర్చిద్దామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మోటూరి వెంకటరమణ, గంతకోరు అప్పారావు, విందుల రాజు, కత్తి తిలక్, సింగిడి సింహాచలం, మాడిశ వెంకటరావు, దాసరి రమేశ్, గీత, మువ్వల మహేశ్, నూకరాజు, పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,134 టీచర్ పోస్టులు ఖాళీలు

- స్కూల్ అసిస్టెంట్స్ కేటగిరీలో 583, ఎస్‌జీటీ 551

విశాఖపట్నం, జూన్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 1,134 ఖాళీలు ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో ఎస్‌జీటీ పోస్టులు 551, స్కూల్ అసిస్టెంట్ కేటగిరీకి సంబంధించి 583 పోస్టులు ఉన్నట్టు పేర్కొంది. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో లాంగ్వేజ్-1 పోస్టులు 41, లాంగ్వేజ్-2 పోస్టులు 43, ఇంగ్లీష్ 59, గణితం 66, ఫిజికల్ సైన్స్ 74, బయాలజీ 62, సోషల్ స్టడీస్ 99, హిందీ 139 ఖాళీలు ఉన్నట్టు వెల్లడించింది. డీఎస్సీపై ప్రభుత్వం ప్రకటన చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అయితే, ఈ వివరాలకు సంబంధించి జిల్లా విద్యా శాఖ ఇంకా ఎటువంటి ప్రకటన చేయలేదు.

ఊర్వశి జంక్షన్‌లో ట్రాఫిక్ టెర్రర్

- పనిచేయని సిగ్నల్స్
- కానరాని పోలీస్ సిబ్బంది
- ఇష్టారీతిగా వాహనాల రాకపోకలు
- తరచూ ప్రమాదాలు
- నియంత్రణ చర్యలు శూన్యం


అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలతో ట్రాఫిక్

కంచరపాలెం, జూన్ 25 : కంచరపాలెం ఊర్వశి జంక్షన్ ట్రాఫిక్ జామ్ సమస్యలతో నిత్యం వాహనదారులు, పాదచారులకు అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. నాలుగు మార్గాల కూడలి కావడంతో జనాలు, వాహనాల రాకపోలతో రద్దీగా ఉంటోంది. అయితే, ట్రాఫిక్ నియంత్రణ సక్రమంగా లేకపోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాఫిక్‌లో వాహనదారులు చిక్కుకుని బయటపడటానికి ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకుంటోంది. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణ కోసం సిగ్నల్ ను ఏర్పాటు చేసి పదినెలలు గడుస్తున్నా, ఈ వ్యవస్థ పనితీరు మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. దీంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. ఈ జంక్షన్ వద్ద కనీసం ట్రాఫిక్ సిబ్బంది కూడా ఎవరిని ఏర్పాటు నియమించకపోవడంతో వాహనాల నియంత్రణ కానరావడం లేదు. అసలే వ్యాపార పరంగా రద్దీగా ఉండే ఈ జంక్షన్ వద్ద ప్రత్యేక నిఘా అవసరంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ కూడా చాలా ప్రధానమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు దృష్టిని సారించి ఇక్కడ సిగ్నల్స్ వ్యవస్థను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. అదేవిధంగా నిత్యం ట్రాఫిక్ బీట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణపై దృష్టిని సారించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.


జాడలేని ట్రాఫిక్ సిబ్బంది


పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపు ధ్యేయం: డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

కంచరపాలెం, జూన్ 25 : బయట ఉన్న బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించి ప్రవేశాలను పెంచడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ పేర్కొన్నారు. నగరంలోని విశాఖ వ్యాలీ స్కూల్లో ఆమె మంగళవారం సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, పార్టు టైం ఇన్‌స్ట్రక్టర్లు, అకౌంటెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితర ఉద్యోగులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఇందుకోసం ప్రభుత్వం విద్యా ప్రవేశం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం షెడ్యూల్‌ను డీఈవో వివరించారు. విద్య ప్రాధాన్యతను గ్రామాల్లో వివరించి డ్రాపౌట్స్‌ను తగ్గించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎంఈవో డా. జి. లక్ష్మి, సీఎంవో అప్పలనాయుడు, గీత, ఎఎల్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక పింఛన్ల మొత్తం పెంపు భేష్'

మురళీనగర్, జూన్ 25; ఇళ్ల వద్దకే సామాజిక భద్రత పింఛన్లు జూలై 1వ తేదీ నుంచి కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం అందించడం గొప్పవిషయమని టీడీపీ విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి సనపల. వరప్రసాద్ అన్నారు. పెంచిన రూ. 4వేల పెన్షన్‌తోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు మూడు వేల రూపాయల పెంచిన మొత్తాన్ని కలిపి జూలై 1వ తేదీన రూ. 7వేలు లబ్ధిదారులకు అందిస్తారని అన్నారు. సామాజిక పెన్షన్లతోపాటు ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు.

ఏయూలో వ్యవస్థీకృత మార్పు అవసరం

- హ్యూమన్ రైట్స్ ఫోరమ్ అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్



నిరసన వ్యక్తం చేస్తున్న సమితి సభ్యులు

వెంకోజీపాలెం, జూన్ 25: ఏయూకి ప్రస్తుతం వ్యవస్థీకృత మార్పు అవసరమని హ్యూమన్ రైట్స్ ఫోరమ్ అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఏయూలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు చేపట్టిన నిరసన దీక్ష మంగళవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా ఆచార్య సూరప్పడు మాట్లాడుతూ టీచింగ్, నాన్ టీచింగ్‌లో కూడా మార్పులు చేయాలన్నారు. ముఖ్యంగా హానరరీ ప్రొఫెసర్, అలాగే నాన్ టీచింగ్‌లో ఉన్న రిటైర్డ్ సభ్యులను కూడా విధులనుంచి తప్పించాలన్నారు. ఏయూ ట్రస్టు ఫ్యాకల్టీ అధ్యక్షు డు డాక్టర్ సురేష్ మీనన్ మాట్లాడుతూ గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కన్సాలిడేటెడ్ పే ఇవ్వాలని కోరారు. వీసీ, రిజిస్ట్రార్‌పై న్యాయ విచారణ జరిపించాలన్నారు.

హయగ్రీవ.. ఆసాంతం వివాదాలమయం

... 5వ పేజీ తరువాయి

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జీవీ, బ్రహ్మాజీ తన నుంచి ప్రాజెక్టును బలవంతంగా లాక్కొన్నారని ఆరోపిస్తూ జగదీశ్వరుడు రెండేళ్ల కిందట సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. తర్వాత ఇరువర్గాల మధ్య రాజీ కుదరడంతో అప్పటివరకూ ఉన్న కోర్టు కేసులను జగదీశ్వరుడు ఉపసంహరించుకున్నారు. కానీ జగదీశ్వరుడు విడుదల చేసిన సెల్ఫీ వీడియో ఆధారంగా అప్పటి జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున వివాదంపై దృష్టిసారించారు. వృద్ధులకు ముందుగా ఆశ్రమం నిర్మించి దానిని ప్రారంభించిన తర్వాత విల్లాలు నిర్మించి వాటిని వృద్ధులకే తక్కువ ధరకు విక్రయించాలని భూకేటాయింపు సమయంలో రాష్ట్ర ప్రభుత్వం షరతు విధించినప్పటికీ దానిని పాటించలేదని ఆయన గుర్తించారు. పైగా నిర్మాణాలు జరగకముందే భూమిని ప్లాట్లుగా విభజించి 15 మందికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారని, మరో 16 మందికి సేల్ అగ్రిమెంట్ చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని అభిప్రాయపడ్డారు. వీటన్నింటి నేపథ్యంలో హయగ్రీవకు భూ కేటాయింపులను రద్దు చేసి, భూమిని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వానికి (సీసీఎల్‌ఏ) ఆయన లేఖ రాశారు. దీంతో ఆ భూమిలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వొద్దంటూ జనసేనకు చెందిన కార్పొరేటర్ మూర్తియాదవ్, టీడీపీ నేతలు కొందరు కోర్టులో పిల్ దాఖలు చేశారు. కోర్టులో కేసు ఇప్పటికీ కొనసాగుతోంది. హయగ్రీవ ప్రాజెక్టుకు భూమిని ప్రభుత్వం కేటాయించినందున ఆ భూమిలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలంటే జిల్లా కలెక్టర్ నుంచి ఎన్‌ఓసీ తప్పనిసరి కాబట్టి దానిని అందజేయాలంటూ జీవీఎంసీ అధికారులు ప్లాన్ ఇవ్వడానికి నిరాకరించారు. జీవీఎంసీ కమిషనర్లుగా పనిచేసిన లక్ష్మీషా, రాజాబాబు కూడా ఇదే కారణంతో ప్లాన్ జారీకి విముఖత చూపగా, ప్రస్తుతం కమిషనర్‌గా పనిచేస్తున్న సాయికాంత్‌వర్మ మాత్రం హైకోర్టులోని మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ అభిప్రాయం తీసుకున్నానంటూ ప్లాన్ జారీచేసేశారు. దీంతో అక్కడ పనులు మొదలయ్యాయి. ఈ విషయాన్ని పిటిషన్‌దారులు హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో కేసులో తుదితీర్పునకు లోబడి చర్యలు ఉంటాయని, తీర్పు ఎలా వచ్చినా స్వీకరించేందుకు సిద్ధమని భావిస్తే నిర్మాణాలు చేసుకోవచ్చునంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం హయగ్రీవ ప్రాజెక్టు భూమిలో నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి.

ఎంపీ సహా ముగ్గురిపై ఫిర్యాదు

ఇదిలావుండగా తాను హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్ భాగస్వామిగా పేర్కొంటూ జగదీశ్వరుడు ఈనెల 22న ఆరిలోవ పోలీసులకు మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆడిటర్ జీవీ, గాదె బ్రహ్మాజీపై ఫిర్యాదుచేశారు. 2020లో హయగ్రీవ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ సమయంలో తనతోపాటు తన భార్యను బెదిరించి కొన్ని ఖాళీపత్రాలపై సంతకాలు తీయించుకున్నారని, తమ సంతకాలను ఫోర్జరీ చేసి హయగ్రీవ ప్రాజెక్టు భూమిని కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జగదీశ్వరుడు ఫిర్యాదుపై ఆరిలోవ పోలీసులు పలు నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్‌ల కింద ముగ్గురిపై కేసు నమోదుచేయడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. కేసు నమోదైన తర్వాత ముగ్గురూ నగరంలో ఆచూకీ లేకపోవడంతో వారిని విచారించేందుకు పోలీసులకు అవకాశం దొరకలేదని సమాచారం.

లీజుకు ఉక్కు వెల్‌నెస్ సెంటర్!

... 5వ పేజీ తరువాయి

వివరిస్తూ ఆదాయ అంచనాలు సమర్పించాలని సూచించారు. బిడ్లు దాఖలు చేయడానికి జూలై 13వ తేదీ వరకు గడువు ఇచ్చారు.

లీజులకు ఇస్తే ఆర్థిక ఇబ్బందులు పోతాయా?

స్థిరాస్తులను అమ్మడం వల్ల ఎంతో కొంత ఆదాయం వస్తుందంటే కార్మికులు, ఉద్యోగులు అంగీకరిస్తున్నారు. కానీ ప్లాంటు ప్రయోజనాల కోసం నిర్మించిన గెస్ట్‌హౌస్‌లు, క్లబ్ హౌస్‌లు, వెల్‌నెస్ సెంటర్లు వంటి వాటిని లీజుకు ఇస్తే కేవలం లక్షల రూపాయల్లోనే ఆదాయం వస్తుంది. దానివల్ల స్టీల్‌ప్లాంటు ఆర్థిక కష్టాలు ఏమీ తీరవు. ఎవరైనా వీఐపీలు వస్తే వారికి ఏ స్టార్ హోటల్‌లోనో బస ఏర్పాటుచేస్తే వచ్చే ఆదాయానికి రెండింతలు ఖర్చు అవుతుంది. ఇండిపెండెంట్ డైరెక్టర్ సూచన మేరకు ఉక్కు మంత్రిత్వ శాఖ చెబుతున్నట్టుగా ఇక్కడి యాజమాన్యం ఆడడం వల్ల ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఉద్యోగ, కార్మిక సంఘాలు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నాయి. స్టీల్‌ప్లాంటు ఉద్యోగులకు సరిగ్గా జీతాలు ఇవ్వడం లేదు. వారి రుణ పరపతితి బాగా పడిపోయింది. ఇటువంటి నేపథ్యంలో టౌన్‌షిప్‌లో ఉన్న వీటిని ఎవరైనా లీజుకు తీసుకుంటే...వాటికి వ్యాపారం ఎలా జరుగుతుందని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. చేతి నిండా డబ్బులు ఉన్నప్పుడే ఏ క్లబ్బులైనా, రెస్టారెంట్లు అయినా కళకళలాడతాయని, నెలాఖరు వచ్చినా జీతాలు అందని ఉద్యోగులు ఉండే చోట లాభదాయకమైన వ్యాపారాలు సాగవని, ఆ మాత్రం గ్రహింపు లేకుండా ప్లాంటు యాజమాన్యం లీజుకు ఇస్తామని, ఎవరైనా ముందుకురావాలని ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని కార్మిక నాయకులు విమర్శిస్తున్నారు. తక్షణమే ఈ చిల్లర ప్రకటనలు నిలుపు చేయాలని, ఉత్పత్తిని పెంచే దిశగా యాజమాన్యం ప్రయత్నించాలని సూచిస్తున్నారు.

ఇసుక కొరత

... 5వ పేజీ తరువాయి

పలువురు బిల్డర్లు వాపోతున్నారు. ఇసుక రవాణాపై ప్రభుత్వం వెంటనే ఒక విధాన నిర్ణయం తీసుకోకపోతే కొద్ది రోజుల్లో నగరంలో ఇసుకకు కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. పెరిగిన రేట్లతో ఇసుక కొనుగోలు చేయడం సాధ్యం కావడం లేదని, అది కూడా నాణ్యమైన ఇసుక లభించనందున నిర్మాణాలు కొనసాగించలేమని అంటున్నారు. రాజమండ్రి/శ్రీకాకుళం నుంచి తెచ్చిన ఇసుకతో పోల్చితే ఒడిశా నుంచి తెచ్చే ఇసుకలో నాణ్యత తక్కువగా ఉంటుందన్నారు.

డిపోల ఇసుకకు రక్షణ ఎవరు?

లంకెలపాలెంలో జాతీయ రహదారికి ఆనుకుని ప్రభుత్వ డిపోలో ఉన్న ఇసుకకు రక్షణ ఎవరు అన్న ప్రశ్న తలెత్తింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఇసుక విధానం ఇంకా ఖరారు చేయలేదు. దీంతో నదుల్లోని రీచ్‌లలో ఇసుక తవ్వకాలు, నగరంలో డిపోల్లో అమ్మకాలు నిలిచిపోయాయి. దీనికంటే ముందుగా డిపోల నిర్వహణ బాధ్యత నుంచి ప్రైవేటు వ్యక్తులు తప్పుకున్నారు. డిపోల్లో ఇసుకకు అక్కడే విడిచి పెట్టేశారు. ప్రస్తుతం డిపో వద్ద ఎవరూ లేకపోవడంతో అక్కడున్న ఇసుకకు ఎవరు రక్షణ ఇవ్వాలి అనేది ప్రశ్నగా మారింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో డిపో వద్ద కాపలా లేకపోవడంతో ఇటీవల కొంత ఇసుకను బయట వ్యక్తులు తరలించుకుపోయారు. గనుల శాఖ అధికారులు గుర్తించి ఇసుక డిపో నుంచి ఇసుక రవాణా చేయకుండా చిన్నపాటి కందకం తవ్వారు. అయినా రాత్రిపూట కొందరు ఇసుక తరలించుకుపోతున్నారు.

వినాయక ఆలయంలో పూజలు


అలంకరణలో వినాయకుడు

అక్కయ్యపాలెం, జూన్ 25 : నాలుగు లేన్ల రహదారి ఆంధ్రజ్యోతి కార్యాలయం పక్కన ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. శైవాగమ సంప్రదాయంలో అర్చకుడు బాలానంద శివాచార్య స్వామి లక్ష్మీ వినాయక హోమం,పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సుబ్రహ్మణ్య శర్మ,జీఎస్టీ అధికారి పి. వేణుగోపాలరావు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే గణబాబు పరామర్శ


శంకరరావును పరామర్శిస్తున్న గణబాబు

ఆర్పీపేట, (కంచరపాలెం), జూన్ 26 : జీవీఎంసీ 56 వార్డు పరిధి 183 బూత్ టీడీపీ కన్వీనర్ నక్కా శంకరరావు పక్షవాతంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈనేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు మంగళవారం ఆయనను పరామర్శించి ఆరోగ్య స్థితిని అడిగితెలుసుకున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి శంకరరావుకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు బి.రాజు రెడ్డి, నేతలు ఉన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

జగదాంబ కూడలి, జూన్ 25: వన్‌టౌన్ బురుజుపేట కనకమహాలక్ష్మికి మంగళవారం అష్టదళ పద్మారాధన సేవలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు 108 స్వర్ణ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య ఉభయదాతలచే పూజలు జరిపించారు.

కొనలేం, తినలేం

... 5వ పేజీ తరువాయి

బీన్స్ 120/150, చేమదుంపలు 44, క్యాప్సికమ్ రూ.84, కాకర 48, బీరకాయలు 40, పచ్చిమిర్చి రూ.64కు విక్రయిస్తున్నారు. అల్లం రూ.160, వెల్లుల్లి రూ.180. తరచూ వినియోగించే బంగాల దుంపలు రూ.32 కాగా ఉల్లిపాయల ధర రూ.36గా ఉంది. ప్రస్తుతానికి తక్కువ ధర ఏదైనా ఉందంటే ఆనపకాయే. కిలో రూ.22 ఉంది. కూరగాయల ధరలపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి అందుబాటులో ఉండేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఘనంగా వైభవ్ జ్యువెలర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు మనోజ్‌కుమార్ గ్రంధి జయంతి


మాట్లాడుతున్న 'వైభవ్' చైర్‌పర్సన్ భారత మల్లికారత్న కుమారి గ్రంధి

సీతంపేట, జూన్ 25: మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యువెలర్స్ లిమిటెడ్ (వైభవ్ జువెలర్స్) వ్యవస్థాపక అధ్యక్షులు, దివంగత మనోజ్ కుమార్ గ్రంధి 58వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం, ఆ సంస్థ పలు సంక్షేమ, సామాజిక కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో భాగంగా ఎఎస్ రాజా వలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 75 మందికిపైగా ఉగ్యోగులు రక్తదానం చేశారు. లీహెల్త్ డొమైన్ (ఐ)ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలోహెల్త్ క్యాంప్, మ్యాక్సివిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యం ఏర్పాటు చేశారు. పలువురికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎఎస్ రాజా వలంటరీ బ్లడ్ బ్యాంక్ ఎండీ డాక్టర్ సుగంధి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మనోజ్‌కుమార్ గ్రంధి మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యూయలర్స్ లిమిటెడ్ (వైభవ్ జ్యువెలర్స్)కే కాకుండా విశాఖ నగరంలో అనేక మంది వ్యాపారులకు స్ఫూర్తిదాయకంగా, మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు. అద్భుతమైన బంగారు ఆభరణాల డిజైన్‌లు, అత్యున్నత స్థాయిలో కస్టమర్లకు సేవలందిచారన్నారు. ఉద్యోగుల సత్‌ప్రవర్తన, స్నేహపూరిత వాతావరణంలో కొనుగోలుదారుల అభిమానం చూరగొనడం అభినందనీయమన్నారు. తమ అధినేత జయంతిని పురస్కరించుకుని ఎంతోమంది ప్రాణాలను కాపాడేలా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే, ఉద్యోగులకు ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించడం వైభవ్ జ్యువెలర్స్‌కు కార్పొరేట్ సామాజిక సేవలపై ఉన్న అంకితభావాన్ని తెలియజేస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్‌పర్సన్ భారత మల్లికారత్నకుమారి గ్రంధి, సంస్థ హోల్‌టైమ్ డైరెక్టర్ అండ్ సీఎఫ్‌వో సాయికీర్తన, సీవోవో రఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, వైభవ్ సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వెంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూన్ 25: కృష్ణా గార్డెన్స్ సమీపంలో ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శ్రీహరిసేవ అధ్యక్షులు ఎస్.అప్పారావు నేతృత్వంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీభూనీలా సమేతులైన శ్రీవారికి మంగళధ్వని, వేద మంత్రాలతో సాంప్రదాయ ప్రకారం శ్రీమాన్ పి.రంగనాథ ఆచార్యులు వారి బృందం ఈ వేడుకను నిర్వహించారు. టి. సుధాకర్‌రెడ్డి, రామనిర్మల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ఈ కల్యాణోత్సవానికి చేసిన వ్యాఖ్యానం ప్రత్యేకతను సంతరించుకుంది. భక్తి సంగీత సేవా సంస్థ శృతిలయ అధ్యక్షులు వి.ప్రభాకర్ వారి బృందం అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎంఎస్ మాధవ్, కొణతాల రాజు, నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

పాలనా సంస్కర్త పూర్వ కలెక్టర్ మల్లికార్జున

- వీడ్కోలు సభలో జిల్లా అధికారులు



ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ మల్లికార్జున

డాబాగార్డెన్స్, జూన్ 25: తన పరిపాలనా విధానాలతో పూర్వ జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున జిల్లా ప్రజల మనసు గెలుచుకున్నారని జిల్లా అధికారులు పేర్కొన్నారు. మంగళవారం దసపల్లా హోటల్‌లో బదిలీపై వెళ్లిన మల్లికార్జునకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మల్లికార్జున దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. జ్ఞాపికలు బహూకరించారు. ఆయనతో అధికారులు తమ అనుభవాలను పంచుకున్నారు. మల్లికార్జున కలెక్టర్‌గా ఆయన తనదైన శైలిలో పరిపాలనా సంస్కర్తగా గుర్తింపు పొందారన్నారు. వైద్య రంగాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అనంతరం మల్లికార్జున మాట్లాడుతూ కలెక్టర్‌గా తన ఈ మూడేళ్ల పరిపాలనలో జిల్లా ప్రజలతో విడదీయరాని బంధం ఏర్పడిందన్నారు. పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు అనేక మందితో పనిచేశానని, ఎన్నో విషయాల్లో వారి అనుభవాలను పంచుకున్నట్టు గుర్తుచేశారు.తమలాంటి వారికి మల్లికార్జున ఆదర్శంగా నిలిచారని ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీ ఎ.రవిశంకర్, జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీఓలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసైతే భవిష్యత్తు నాశనం


మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నాయుడు

సీతమ్మధార, జూన్ 25: మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు నాశనమవుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జేవీఏ నాయుడు సూచించారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీ హెచ్ జీవీఎంసీ స్కూల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఇన్‌స్పెక్టర్ జేవీఏ నాయుడు మాట్లాడుతూ ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయించినా, విద్యార్థులను డ్రగ్స్ తీసుకునే విధంగా ప్రేరేపించినా తమ దృష్టికి, లేదా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలన్నారు. మత్తు పదార్థాలను ప్రోత్సహించిన వారిపై తక్షణం చర్యలు తీసుకుంటమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముసలనాయుడు, హెచ్‌సీ సత్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30న చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు

సీతమ్మధార, జూన్ 25: పిల్లలు, యువతకు పర్యావరణ పరిరక్షణ, జీవ కారుణ్యంపై అవగాహన కల్పిస్తూ ఇండియా యూత్ ఫర్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గాంధీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలుచేపట్టనున్నట్టు సంస్థల ప్రతినిధులు, పర్యావరణ ఇంజనీర్ పీవీ ముకుందరావు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 30న బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ పిల్లలకు చిత్రలేఖనం పోటీలు, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన ఇంటనేషనల్ ప్లాస్టిక్ ఫ్రీ డే అనే పోస్టర్‌ని ఇండియా యూత్ ఫర్ సొసైటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. 30వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల ఐదేళ్ల నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, విద్యార్థులు పోటీలో పాల్గొనాలని కోరారు. ఫోన్: 89780 19596లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సొసైటీ ప్రతినిధి అప్పలరెడ్డి తెలిపారు.

హయగ్రీవ భూ కేటాయింపులు రద్దు చేయాలి

- జనసేన నేత పీతల మూర్తియాదవ్


ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతి ప్రతమిస్తున్న మూర్తియాదవ్

మహరాణిపేట, జూన్ 25: హయగ్రీవ సంస్థకు భూ కేటాయింపులు రద్దు చేసి ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జనసేన నేత పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్‌ను కలసి వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లా ఎండాడ గ్రామ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం భూమిని అనాథ, వృద్ధాశ్రమానికి మిగిలిన 90 శాతం భూమి వయోవృద్ధులకు మాత్రమే గృహ నిర్మాణాలు చేసి విక్రయించాలనే నిబంధనలతో 12.50 ఎకరాల కొండ పోరంబోకు స్థలాన్ని హయగ్రీవ ఫార్మ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థకు కేటాయించిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయటంలో ఆ సంస్థ విఫలం కావటంతో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని వెనక్కి తీసుకుందన్నారు. దీనిపై హయగ్రీవ సంస్థ కోర్టులో సవాలు చేయగా మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేసుకోవాలని తీర్పు నిచ్చిందన్నారు. హయగ్రీవ సంస్థ ప్రభుత్వ ఉద్దేశాన్ని పక్కకు పెట్టి రియల్‌ఎస్టేట్ ప్రయోజనాల కోసం వినియోగించినట్టు మూర్తియాదవ్ ఆరోపించారు. దీనిపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలై, విచారణ జరుగుతోందన్నారు. అయినా, జీవీఎంసీ నుంచి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చారన్నారు. ఈ సంస్థ ప్రాజెక్టు పూర్తి చేయకుండా అక్రమ లావాదేవీలు జరిపిందన్నారు. ప్రాజెక్టు ఆశయాలు నెరవేర్చడంతో హయగ్రీవ సంస్థ విఫలమైనందున నిబంధనల ప్రకారం ఈ భూ కేటాయింపులు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



రోడ్లను బ్లాక్ చేసి ఇళ్ల నిర్మాణాలు

గాజువాక, జూన్ 25:
రహదారులను బ్లాక్ చేసి మరీ ఇళ్లు, భవన నిర్మాణాలను చేపట్టడం గాజువాకలో సర్వసాధారణంగా మారింది. రోడ్లను బ్లాక్ చేయడం వల్ల ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణదారులు కనీస నిబంధనలను పాటించకుండా రోడ్లను బ్లాక్ చేయడం వల్ల వారితో వాహనదారులు వివాదాలకు దిగుతున్నారు. అయినప్పటికీ భవన నిర్మాణదారులు పట్టించు కోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు.

67వ వార్డు పరిధి పంతులుగారి మేడ రోడ్డులో ఓ ఇంటి నిర్మాణం జరుగుతోంది. ఈ ఇంటి నిర్మాణం కోసం రోడ్డు మొత్తం ఇసుక, పిక్కరాయి, సిమెంటు, ఇతర సామగ్రిని మొత్తం రహదారికి అడ్డంగా డంపింగ్ చేశారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడం కష్టతరంగా మారిందని వాహనదారులు, స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై స్థానికులు నిర్మాణ దారుడిని నిలదీసినా నిర్మాణ సామగ్రిని రోడ్డు పైనుంచి తొలగించలేదు. ఈ విషయమై టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదని స్థానికులు చెబుతున్నారు. కాగా గాజువాక నియోజకవర్గంలో అనేకచోట్ల రహదారులను ఇష్టానుసారంగా బ్లాక్ చేసి భవన నిర్మాణాలను సాగిస్తున్నారు. ఇందుకు సంబంధించి టౌన్ ప్లానింగ్ విభాగానికి ఫిర్యాదులు అందుతున్నప్పటికీ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు చొరవ చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులను బ్లాక్ చేస్తున్న వారిపై తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


పంతులుగారి మేడ వద్ద ఓ ఇంటి నిర్మాణం నిమిత్తం రోడ్డును బ్లాక్ చేసిన దృశ్యం

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు, పాదచారులు

గాజువాకలో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి..

ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేస్తాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూన్ 25: స్టీల్‌ప్లాంటును పరిరక్షించడంతో పాటు ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును నాడు తెలుగుదేశం ప్రభుత్వం కాపాడిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కాపాడుతుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉక్కు కర్మాగారానికి అన్ని విధాల అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఈ సమావేశంలో నాయకులు నమ్మి సింహాద్రి, కనకరెడ్డి, అప్పారావు, శ్రీకాంత్, కిరణ్, వెంకటరావు, అచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ పండుగ

కూర్మన్నపాలెం, జూన్ 25: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి ప్రజల ఆరాధ్య దైవం పరదేశమ్మ అమ్మవారి పండుగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించారు. అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా పరదేశమ్మకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు తగిన చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎస్ఎస్ విజయరామరాజు, ప్రగడ వేణుబాబు, సూరిశెట్టి పెంటారావు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, సన్యాసిరావు, బొడ్డ సూరిబాబు, పి.శ్రీనివాస్, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.


కణితిలో పూజలందుకున్న పరదేశమ్మ, అమ్మవారి దర్శనానికి క్యూలో వేచివున్న భక్తులు

చంద్రనగర్‌లో పరదేశమ్మ..

గోపాలపట్నం: ఇక్కడి చంద్రనగర్‌లో కొలువుదీరిన పరదేశమ్మ అమ్మవారి పండుగను ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వేకువజామున అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని నిర్వాహకులు పంపిణీ చేశారు.

బుచ్చిరాజుపాలెంలో పైడిమాంబ..

ఎన్.ఎ.డి.జంక్షన్: బుచ్చిరాజుపాలెంలో పైడిమాంబ పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

వేంకటేశ్వరస్వామికి మహాభిషేకం


వాంబే కాలనీలో శ్రీవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెదగంట్యాడ, జూన్ 25: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీలోని వెంకటాద్రిపై కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి మంగళవారం మహాభిషేకం జరిపారు. శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు శ్రీవారికి మహాభిషేకం చేశారు. పాలు, పెరుగు, పండ్ల రసాలు, తేనె, నెయ్యి, పంచదార, సుగంధద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, తదితరులు పాల్గొన్నారు. కాగా మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రికొండపై కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. రవినగర్‌కు చెందిన కోనేటి రావు, రజని దంపతులు ఆర్థిక సాయంతో మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. అర్చకులు శ్రీనివాస స్వామి దాతలకు స్వామివారి జ్ఞాపికను అందజేశారు. సాయంత్రం సామూహిక భక్తిగీతాలన, విష్ణుసహస్ర నామ పారాయణం పఠించారు. కార్యక్రమంలో ఆదినారాయణరావు, దేముడు, కృష్ణమూర్తి, సన్యాసిరావు, రాజేంద్ర, శ్రీహరి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

విమాన్ నగర్‌లో ఆలయ వార్షికోత్సవం

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు విమాన్ నగర్‌లో వైకుంఠ వేంకటేశ్వరాలయ వార్షికోత్సవాలను ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అర్చకులు వెంకట అప్పలాచారిస్వామి మంగళవారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్య హోమం కోట్నాలు, ఊంజల్‌సేవ, తదితర పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం శ్రీవారి కల్యాణం, 27న అన్న సమారాధన, పుష్పయాగం నిర్వహించనున్నారు.


విమాన్ నగర్‌లో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

ఆ బార్‌లో నిరంతరాయంగా అమ్మకాలు

పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

వెల్లువెత్తుతున్న విమర్శలు

మల్కాపురం, జూలై 25: పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురంలో ఓ బార్‌లో నిరంతరాయంగా అమ్మకాలు సాగుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఈ బార్ 24 గంటలూ తెరిచి ఉండడం వెనక ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక అనుమతులు ఉన్నాయని బార్ సిబ్బంది చెబుతుండడం గమనార్హం. నిరంతరాయంగా ఈ బార్‌లో మద్యం అమ్మకాలు జరుగుతుండడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ మద్యం సేవించడం.. మందుబాబులు గొడవలకు దిగుతుండడం తమకు తలనొప్పిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓ నేవీ ఉద్యోగిని రాత్రి పన్నెండు గంటల సమయంలో కొంతమంది మందుబాబులు మద్యానికి డబ్బులు అడిగారు.

అందుకు ఆయన నిరాకరించడంతో చితకబాదారు. ఈ విషయమై మల్కాపురం పోలీసు లకు ఫిర్యాదు కూడా అందింది. ఈ బార్‌ను మిగతా వాటి మాదిరిగానే రాత్రిపూట మూసివేస్తే ఎలాంటి గొడవలు తలెత్తవని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా ఈ బార్‌ను గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌లలో నడుపుతున్నారు. రాత్రి నిర్దేశిత సమయానికి గ్రౌండ్ ఫ్లోర్‌లో మద్యం అమ్మకాలను నిలిపివేస్తున్నా, ఫస్ట్ ఫ్లోర్‌లో మాత్రం మద్యం అమ్మకాలు 24 గంటలూ జరుగుతున్నా.. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ బార్‌లో నిరంతరాయంగా సాగుతున్న మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ ఉన్నతాధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'శారదా పీఠం భూములను స్వాధీనం చేసుకోవాలి'

విశాఖపట్నం, జూన్ 25 : శారదా పీఠానికి కేటాయించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, జె.శ్రీరామ్మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. శారదా పీఠానికి జగన్ ప్రభుత్వం రూ. 200 కోట్ల విలువైన భూములను కేవలం రూ.15 లక్షలకు ఇచ్చేసిందన్నారు. ప్రభుత్వం ఆ భూములను వెనక్కి తీసు కుని ప్రజా కార్యకలాపాలకు గాని, అణగారిన వర్గాల సంక్షేమానికి గాని ఉపయోగించాలని కోరారు. ఆశ్రమాల పేరుతో స్వామీజీలు భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

ఊరటనిచ్చిన వర్షం


వర్షం కారణంగా ఖాళీగా ఉన్న రోడ్డు

గోపాలపట్నం, జూన్ 25: గోపాలపట్నం పరిసర ప్రాంతంలో మంగళవారం సాయంత్రం వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. కొద్దిరోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయితే సాయంత్రం వేళల్లో వాతావరణ మారి, తేలికపాటి వర్షాలు కురుస్తుండడంతో కాస్త ఊరట చెందుతున్నారు. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో ప్రజలు సేదతీరారు.

బొర్రమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి, జూన్ 25: అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బొర్రమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వేకువజామున అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించగా, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉక్కు యాజమాన్యం ముందుకు రావాలి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 25: స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ఉక్కు యాజమాన్యం ముందుకు రావాలని ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మంత్రి రవి కోరారు. ఇటీవల కార్మిక వర్గం నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో యాజమాన్యం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని, కార్మిక సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.


స్థానికులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు

శిథిల వసతిగృహాలను పరిశీలించిన జెడ్పీ సీఈవో

అన్యాక్రాంతమైన స్థల పరిరక్షణకు చర్యలు చేపడతామన్న అధికారులు

గోపాలపట్నం, జూన్ 25: సింహాచలం రైల్వే స్టేషన్‌కు సమీపంలో శిథిలావస్థలో ఉన్న జిల్లా పరిషత్ వసతిగృహాలను జెడ్పీ సీఈవో పోలినాయుడు మంగళవారం పరిశీలించారు. 'ప్రమాదకరంగా మారిన శిథిల వసతి గృహాలు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జెడ్పీ అధికారులు స్పందించారు. ఈ మేరకు గోపాలపట్నంలో ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన వసతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గృహాలను పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న ఈ వసతిగృహాలు శిథిల స్థితికి చేరి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. అయితే ఖాళీగా ఉన్న వీటిలో కొందరు అనధికారికంగా ఉన్నట్టు గుర్తించారు. ఈ వసతిగృహాలు కూలిపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున పోలీసుల సాయంతో తక్షణమే ఖాళీ చేయించడానికి చర్యలు చేపట్టనున్నట్టు పోలినాయుడు తెలిపారు. కాగా ఇక్కడి జెడ్పీ స్థలం చాలావరకు అన్యాక్రాంతమైనట్టు గుర్తించారు. అందువల్ల పూర్తి స్థాయిలో సర్వే జరిపి జెడ్పీ స్థల పరిరక్షణకు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

'ఉక్కు'లో ఉద్యోగుల సంఖ్య పెంచాలి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 25: స్టీల్‌ప్లాంటులో ఉద్యోగుల సంఖ్య పెంచాలని, ప్రతినెలా పదవీ విరమణ చేస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నందున ఉక్కు యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు. ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారిపై పని భారం పడుతోందన్నారు. అందువల్ల ఉక్కు యాజమాన్యం ఉద్యోగాల భర్తీకి చర్యటు చేపట్టాలన్నారు.

సరిపల్లిలో దంత వైద్య శిబిరం

పెందుర్తి, జూన్ 25: మండలంలోని సరిపల్లిలో ముక్కు సీతారామయ్య కల్యాణ మండపంలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనిల్ నీరుకొండ దంత వైద్యశాల ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్ గొర్లె రామకృష్ణ జగన్నాథం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబారాలను నిర్వహించడం వల్ల దంత పరిరక్షణపై ప్రజలకు అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం సుమారు 150 మందికి వైద్యులు దంత పరీక్షలు నిర్వహించారు.

వీధి కుక్కలు పట్టివేత



అగనంపూడి, జూన్ 25: జీవీఎంసీ 79వ వార్డు పరిధి అగనంపూడి, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో వీధి కుక్కల నియంత్రణకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల గ్రామాల్లోని వీధి కుక్కలు అధికమైపోవడంతో పాటు పాదచారుల, వాహనదారులు, వృద్ధులు, చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. దీంతో ప్రజలకు బయటకు వచ్చేందుకే భీతిల్లే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో టీడీపీ వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవాని ఈ విషయాన్ని జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో కుక్కల నియంత్రణకు సిబ్బంది చర్యలు చేపట్టారు. వీధి కుక్కలను వలల ద్వారా పట్టుకుని ఇక్కడ నుంచి తరలించారు.

సినిమా గైడ్

- **మహరాజ :** మెలోడీ, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మికాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఒంఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 62, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 66, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 30, క్యారెట్ 38, దొండకాయలు 28, బంగాళదుంపలు 32, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 160, మునక్కాడలు (కిలో) 150, బరబాటి 58, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 130, పొటల్స్ 34, కీరదోస 38, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 60, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	--	128
ఫారం ధర	--	148
విత్ స్కిన్	--	266
స్కిన్‌లెస్	--	276

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..


సమావేశంలో మాట్లాడుతున్న గణబాబు

వార్డుల్లోని సమస్యలను పరిష్కరిస్తాం

పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, జూన్ 25: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వార్డుల్లో ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. కొత్తపాలెం గ్రామంలోని ఓ కల్యాణ మండపంలో 89, 90, 91, 92 వార్డుల బూత్ కన్వీనర్లు, ముఖ్య నాయకులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ దశలవారీగా అన్ని ప్రాంతాల్లోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు దాడి వెంకటరమేశ్, బొమ్మిడి రమణ, జనసేన నాయకురాలు అంగ దుర్గా ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

సాకేతపురంలో ఒరిగిన భారీ ట్రాలర్


క్రేన్ల సాయంతో ఒరిగిన ట్రాలర్‌ను తీస్తున్న దృశ్యం

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 25: ఎన్ఏడీ నుంచి కాకానీనగర్‌కు వెళ్లే హైవేలో సాకేతపురం జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం కారును తప్పించే ప్రయత్నంలో భారీ ట్రాలర్ అదుపు తప్పి రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ కూడలి వద్ద ఓ కారు ఆగిపోయింది. దీని వెనుక ఐరన్ లోడ్‌తో వస్తున్న భారీ ట్రాలర్ ఈ కారును తప్పించేందుకు గాను సడన్ బ్రేక్ వేయడంతో ఆ వాహనం ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాన్ని ఢీకొని పక్కకు ఒరిగిపోయింది. ఆ సమయంలో పెద్దగా ట్రాఫిక్ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. పక్కనే షెడ్డులో ఉంటున్న నివాసితులకు కూడా ఏమీ కాలేదు. ఎయిర్‌పోర్టు ట్రాఫిక్ పోలీసులు, రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించి, క్రేన్ల సాయంతో ఒరిగిన ట్రాలర్‌ను రహదారిపైకి తెచ్చారు.

రహదారులపై పారుతున్న మురుగు

ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు, పాదచారులు


కణితి రోడ్డులో పారుతున్న మురుగు నీరు

గాజువాక, జూన్ 25: ప్రధాన రహదారులపై మురుగు నీరు పారడం గాజువాక పరిసర ప్రాంతాల్లో నిత్యకృత్యంగా మారింది. ప్రధాన రహదారులపై మురుగు నీరు పారుతుండడం వల్ల తీవ్ర దుర్వాసన వెదజల్లడంతో పాటు పరిసర ప్రాంతాలు అధ్వానంగా మారుతున్నాయి. రోడ్లకు ఇరుపక్కలా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, ఇళ్ల నుంచి, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు మొత్తం ప్రధాన రహదారులపైనే పారుతుంది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధానంగా కణితి రోడ్డు ప్రాంతంలో చినగంట్యాడ, వంటిళ్ల రోడ్డు, అజీమాబాద్, జగ్గు జంక్షన్ రోడ్డు, కణితి మార్కెట్ రోడ్డు, మసీదు ప్రాంతాల్లో నిత్యం మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుందని స్థానికులతో పాటు వాహనదారులు వాపోతున్నారు. మురుగు నీరు రోడ్డుపై పారకుండా జీవీఎంసీ అధికారులు డ్రైనేజీ వ్యవస్థను పటిష్ఠంగా తీర్చిదిద్దాలని ప్రజలు వేడుకుంటున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కణితి రోడ్డు మొత్తం ఇదే దుస్థితి నెలకొనడంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, పాదచారులు నానాపాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హోం మంత్రి అనితను కలిసిన టీడీపీ నాయకులు


మంత్రి వంగలపూడి అనితతో టీడీపీ పెందుర్తి మండల నాయకులు

పెందుర్తిరూరల్, జూన్ 25: తెలుగుదేశం పార్టీ పెందుర్తి మండల నాయకులు మంగళవారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను పాయకరావుపేటలోని ఓ అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మండలంలో పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకొన్నారు. ఏ సమస్యపైనైనా తనను నేరుగా కలిసి వివరించవచ్చని ఆమె వారికి భరోసా ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, చింతలఅగ్రహారం సర్పంచ్ దాడి గోపి అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పి.అప్పారావు, సీనియర్ నాయకులు బొడ్డేటి సతీశ్, పెంటయ్యనాయుడు, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, జూన్ 25: పద్మనాభపురంలో కొత్త లైన్ల ఏర్పాటు, ఇతర నిర్వహణ పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు పలు ప్రాంతాలను విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ వేపగుంట ఏఈ డి.వి.రమణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా బంటాకాలనీ, అప్పలనరసయ్య కాలనీ, వెంకటసాయినగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పార్కింగ్ షెడ్లను నిర్మించాలని ఉక్కు ఉద్యోగుల వినతి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 25: ఉక్కు కర్మాగారం ప్రధాన రహదారిలోని ఉక్కునగరం, కణితి జంక్షన్‌ల వద్ద వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు సరైన పార్కింగ్ స్థలం లేకపోవటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ ప్రాంతానికి పూర్తి స్థాయిలో బస్సు సౌకర్యం లేనందున ఉద్యోగులు, కార్మికులు తమ ద్విచక్ర వాహనాలపై ఆయా జంక్షన్‌ల వరకు వచ్చి, అక్కడ వాహనాలను పార్కింగ్ చేసి బస్సులో ప్లాంటుకు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆయా చోట్ల పార్కింగ్ సౌకర్యం లేనందున చెట్ల కింద వాహనాలను నిలుపుతున్నారు. అలా పార్కింగ్ చేయడం వల్ల తరచూ తమ వాహనాల విడి బాగాలు అపహరణకు గురవుతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల అధికారులు స్పందించి పార్కింగ్ కోసం షెడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

ఊర్వశి జంక్షన్‌లో ట్రాఫిక్ టెర్రర్

- పనిచేయని సిగ్నల్స్
- కానరాని పోలీస్ సిబ్బంది
- ఇష్టారీతిగా వాహనాల రాకపోకలు
- తరచూ ప్రమాదాలు
- నియంత్రణ చర్యలు శూన్యం


అస్తవ్యస్తంగా వాహనాల రాకపోకలతో ట్రాఫిక్

కంచరపాలెం, జూన్ 25 : కంచరపాలెం ఊర్వశి జంక్షన్ ట్రాఫిక్ జామ్ సమస్యలతో నిత్యం వాహనదారులు, పాదచారులకు అవస్థలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. నాలుగు మార్గాల కూడలి కావడంతో జనాలు, వాహనాల రాకపోలతో రద్దీగా ఉంటోంది. అయితే, ట్రాఫిక్ నియంత్రణ సక్రమంగా లేకపోవడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ట్రాఫిక్‌లో వాహనదారులు చిక్కుకుని బయటపడటానికి ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకుంటోంది. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణ కోసం సిగ్నల్ ను ఏర్పాటు చేసి పదినెలలు గడుస్తున్నా, ఈ వ్యవస్థ పనితీరు మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. దీంతో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. ఈ జంక్షన్ వద్ద కనీసం ట్రాఫిక్ సిబ్బంది కూడా ఎవరిని ఏర్పాటు నియమించకపోవడంతో వాహనాల నియంత్రణ కానరావడం లేదు. అసలే వ్యాపార పరంగా రద్దీగా ఉండే ఈ జంక్షన్ వద్ద ప్రత్యేక నిఘా అవసరంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ కూడా చాలా ప్రధానమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు దృష్టిని సారించి ఇక్కడ సిగ్నల్స్ వ్యవస్థను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. అదేవిధంగా నిత్యం ట్రాఫిక్ బీట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణపై దృష్టిని సారించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.


జాడలేని ట్రాఫిక్ సిబ్బంది


పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపు ధ్యేయం: డీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

కంచరపాలెం, జూన్ 25 : బయట ఉన్న బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించి ప్రవేశాలను పెంచడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ పేర్కొన్నారు. నగరంలోని విశాఖ వ్యాలీ స్కూల్లో ఆమె మంగళవారం సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, పార్టు టైం ఇన్‌స్ట్రక్టర్లు, అకౌంటెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితర ఉద్యోగులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు బడిఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఇందుకోసం ప్రభుత్వం విద్యా ప్రవేశం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం షెడ్యూల్‌ను డీఈవో వివరించారు. విద్య ప్రాధాన్యతను గ్రామాల్లో వివరించి డ్రాపౌట్స్‌ను తగ్గించేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏసీపీ బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎంవో డా. జి. లక్ష్మి, సీఎంవో అప్పలనాయుడు, గీత, ఎఎల్ఎస్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక పింఛన్ల మొత్తం పెంపు భేష్'

మురళీనగర్, జూన్ 25; ఇళ్ల వద్దకే సామాజిక భద్రత పింఛన్లు జూలై 1వ తేదీ నుంచి కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం అందించడం గొప్పవిషయమని టీడీపీ విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి సనపల. వరప్రసాద్ అన్నారు. పెంచిన రూ. 4వేల పెన్షన్‌తోపాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు మూడు వేల రూపాయల పెంచిన మొత్తాన్ని కలిపి జూలై 1వ తేదీన రూ. 7వేలు లబ్ధిదారులకు అందిస్తారని అన్నారు. సామాజిక పెన్షన్లతోపాటు ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తంచేశారు.

ఏయూలో వ్యవస్థీకృత మార్పు అవసరం

- హ్యూమన్ రైట్స్ ఫోరమ్ అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్


నిరసన వ్యక్తం చేస్తున్న సమితి సభ్యులు

వెంకోజీపాలెం, జూన్ 25: ఏయూకి ప్రస్తుతం వ్యవస్థీకృత మార్పు అవసరమని హ్యూమన్ రైట్స్ ఫోరమ్ అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఏయూలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు చేపట్టిన నిరసన దీక్ష మంగళవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా ఆచార్య సూరప్పడు మాట్లాడుతూ టీచింగ్, నాన్ టీచింగ్‌లో కూడా మార్పులు చేయాలన్నారు. ముఖ్యంగా హానరరీ ప్రొఫెసర్, అలాగే నాన్ టీచింగ్‌లో ఉన్న రిటైర్డ్ సభ్యులను కూడా విధులనుంచి తప్పించాలన్నారు. ఏయూ ట్రస్టు ఫ్యాకల్టీ అధ్యక్షు డు డాక్టర్ సురేష్ మీనన్ మాట్లాడుతూ గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, కన్సాలిడేటెడ్ పే ఇవ్వాలని కోరారు. వీసీ, రిజిస్ట్రార్‌పై న్యాయ విచారణ జరిపించాలన్నారు.

హయగ్రీవ.. ఆసాంతం వివాదాలమయం

... 5వ పేజీ తరువాయి

ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జీవీ, బ్రహ్మాజీ తన నుంచి ప్రాజెక్టును బలవంతంగా లాక్కొన్నారని ఆరోపిస్తూ జగదీశ్వరుడు రెండేళ్ల కిందట సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. తర్వాత ఇరువర్గాల మధ్య రాజీ కుదరడంతో అప్పటివరకూ ఉన్న కోర్టు కేసులను జగదీశ్వరుడు ఉపసంహరించుకున్నారు. కానీ జగదీశ్వరుడు విడుదల చేసిన సెల్ఫీ వీడియో ఆధారంగా అప్పటి జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున వివాదంపై దృష్టిసారించారు. వృద్ధులకు ముందుగా ఆశ్రమం నిర్మించి దానిని ప్రారంభించిన తర్వాత విల్లాలు నిర్మించి వాటిని వృద్ధులకే తక్కువ ధరకు విక్రయించాలని భూకేటాయింపు సమయంలో రాష్ట్ర ప్రభుత్వం షరతు విధించినప్పటికీ దానిని పాటించలేదని ఆయన గుర్తించారు. పైగా నిర్మాణాలు జరగకముందే భూమిని ప్లాట్లుగా విభజించి 15 మందికి విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారని, మరో 16 మందికి సేల్ అగ్రిమెంట్ చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని అభిప్రాయపడ్డారు. వీటన్నింటి నేపథ్యంలో హయగ్రీవకు భూ కేటాయింపులను రద్దు చేసి, భూమిని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వానికి (సీసీఎల్ఏ) ఆయన లేఖ రాశారు. దీంతో ఆ భూమిలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వొద్దంటూ జనసేనకు చెందిన కార్పొరేటర్ మూర్తియాదవ్, టీడీపీ నేతలు కొందరు కోర్టులో పిల్ దాఖలు చేశారు. కోర్టులో కేసు ఇప్పటికీ కొనసాగుతోంది. హయగ్రీవ ప్రాజెక్టుకు భూమిని ప్రభుత్వం కేటాయించినందున ఆ భూమిలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలంటే జిల్లా కలెక్టర్ నుంచి ఎన్ఓసీ తప్పనిసరి కాబట్టి దానిని అందజేయాలంటూ జీవీఎంసీ అధికారులు ప్లాన్ ఇవ్వడానికి నిరాకరించారు. జీవీఎంసీ కమిషనర్లుగా పనిచేసిన లక్ష్మీషా, రాజాబాబు కూడా ఇదే కారణంతో ప్లాన్ జారీకి విముఖత చూపగా, ప్రస్తుతం కమిషనర్‌గా పనిచేస్తున్న సాయికాంత్‌వర్మ మాత్రం హైకోర్టులోని మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ అభిప్రాయం తీసుకున్నానంటూ ప్లాన్ జారీచేసేశారు. దీంతో అక్కడ పనులు మొదలయ్యాయి. ఈ విషయాన్ని పిటిషన్‌దారులు హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో కేసులో తుదితీర్పునకు లోబడి చర్యలు ఉంటాయని, తీర్పు ఎలా వచ్చినా స్వీకరించేందుకు సిద్ధమని భావిస్తే నిర్మాణాలు చేసుకోవచ్చునంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం హయగ్రీవ ప్రాజెక్టు భూమిలో నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి.

ఎంపీ సహా ముగ్గురిపై ఫిర్యాదు

ఇదిలావుండగా తాను హయగ్రీవ ఫామ్స్ అండ్ డెవలపర్స్ భాగస్వామిగా పేర్కొంటూ జగదీశ్వరుడు ఈనెల 22న ఆరిలోవ పోలీసులకు మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఆడిటర్ జీవీ, గాదె బ్రహ్మాజీపై ఫిర్యాదుచేశారు. 2020లో హయగ్రీవ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ సమయంలో తనతోపాటు తన భార్యను బెదిరించి కొన్ని ఖాళీపత్రాలపై సంతకాలు తీయించుకున్నారని, తమ సంతకాలను ఫోర్జరీ చేసి హయగ్రీవ ప్రాజెక్టు భూమిని కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జగదీశ్వరుడు ఫిర్యాదుపై ఆరిలోవ పోలీసులు పలు నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్‌ల కింద ముగ్గురిపై కేసు నమోదుచేయడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. కేసు నమోదైన తర్వాత ముగ్గురూ నగరంలో ఆచూకీ లేకపోవడంతో వారిని విచారించేందుకు పోలీసులకు అవకాశం దొరకలేదని సమాచారం.

లీజుకు ఉక్కు వెల్‌నెస్ సెంటర్!

... 5వ పేజీ తరువాయి

వివరిస్తూ ఆదాయ అంచనాలు సమర్పించాలని సూచించారు. బిడ్లు దాఖలు చేయడానికి జూలై 13వ తేదీ వరకు గడువు ఇచ్చారు.

లీజులకు ఇస్తే ఆర్థిక ఇబ్బందులు పోతాయా?

స్థిరాస్తులను అమ్మడం వల్ల ఎంతో కొంత ఆదాయం వస్తుందంటే కార్మికులు, ఉద్యోగులు అంగీకరిస్తున్నారు. కానీ ప్లాంటు ప్రయోజనాల కోసం నిర్మించిన గెస్ట్‌హౌస్‌లు, క్లబ్ హౌస్‌లు, వెల్‌నెస్ సెంటర్లు వంటి వాటిని లీజుకు ఇస్తే కేవలం లక్షల రూపాయల్లోనే ఆదాయం వస్తుంది. దానివల్ల స్టీల్‌ప్లాంటు ఆర్థిక కష్టాలు ఏమీ తీరవు. ఎవరైనా వీఐపీలు వస్తే వారికి ఏ స్టార్ హోటల్‌లోనో బస ఏర్పాటుచేస్తే వచ్చే ఆదాయానికి రెండింతలు ఖర్చు అవుతుంది. ఇండిపెండెంట్ డైరెక్టర్ సూచన మేరకు ఉక్కు మంత్రిత్వ శాఖ చెబుతున్నట్టుగా ఇక్కడి యాజమాన్యం ఆడడం వల్ల ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఉద్యోగ, కార్మిక సంఘాలు ముక్తకంఠంతో ఆరోపిస్తున్నాయి. స్టీల్‌ప్లాంటు ఉద్యోగులకు సరిగ్గా జీతాలు ఇవ్వడం లేదు. వారి రుణ పరపతిని బాగా పడిపోయింది. ఇటువంటి నేపథ్యంలో టౌన్‌షిప్‌లో ఉన్న వీటిని ఎవరైనా లీజుకు తీసుకుంటే...వాటికి వ్యాపారం ఎలా జరుగుతుందని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. చేతి నిండా డబ్బులు ఉన్నప్పుడే ఏ క్లబ్బులైనా, రెస్టారెంట్లు అయినా కళకళలాడతాయని, నెలాఖరు వచ్చినా జీతాలు అందని ఉద్యోగులు ఉండే చోట లాభదాయకమైన వ్యాపారాలు సాగవని, ఆ మాత్రం గ్రహింపు లేకుండా ప్లాంటు యాజమాన్యం లీజుకు ఇస్తామని, ఎవరైనా ముందుకురావాలని ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని కార్మిక నాయకులు విమర్శిస్తున్నారు. తక్షణమే ఈ చిల్లర ప్రకటనలు నిలుపు చేయాలని, ఉత్పత్తిని పెంచే దిశగా యాజమాన్యం ప్రయత్నించాలని సూచిస్తున్నారు.

ఇసుక కొరత

... 5వ పేజీ తరువాయి

పలువురు బిల్డర్లు వాపోతున్నారు. ఇసుక రవాణాపై ప్రభుత్వం వెంటనే ఒక విధాన నిర్ణయం తీసుకోకపోతే కొద్ది రోజుల్లో నగరంలో ఇసుకకు కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. పెరిగిన రేట్లతో ఇసుక కొనుగోలు చేయడం సాధ్యం కావడం లేదని, అది కూడా నాణ్యమైన ఇసుక లభించనందున నిర్మాణాలు కొనసాగించలేమని అంటున్నారు. రాజమండ్రి/శ్రీకాకుళం నుంచి తెచ్చిన ఇసుకతో పోల్చితే ఒడిశా నుంచి తెచ్చే ఇసుకలో నాణ్యత తక్కువగా ఉంటుందన్నారు.

డిపోల ఇసుకకు రక్షణ ఎవరు?

లంకెలపాలెంలో జాతీయ రహదారికి ఆనుకుని ప్రభుత్వ డిపోలో ఉన్న ఇసుకకు రక్షణ ఎవరు అన్న ప్రశ్న తలెత్తింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఇసుక విధానం ఇంకా ఖరారు చేయలేదు. దీంతో నదుల్లోని రీచ్‌లలో ఇసుక తవ్వకాలు, నగరంలో డిపోల్లో అమ్మకాలు నిలిచిపోయాయి. దీనికంటే ముందుగా డిపోల నిర్వహణ బాధ్యత నుంచి ప్రైవేటు వ్యక్తులు తప్పుకున్నారు. డిపోల్లో ఇసుకకు అక్కడే విడిచి పెట్టేశారు. ప్రస్తుతం డిపో వద్ద ఎవరూ లేకపోవడంతో అక్కడున్న ఇసుకకు ఎవరు రక్షణ ఇవ్వాలి అనేది ప్రశ్నగా మారింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో డిపో వద్ద కాపలా లేకపోవడంతో ఇటీవల కొంత ఇసుకను బయట వ్యక్తులు తరలించుకుపోయారు. గనుల శాఖ అధికారులు గుర్తించి ఇసుక డిపో నుంచి ఇసుక రవాణా చేయకుండా చిన్నపాటి కందకం తవ్వారు. అయినా రాత్రిపూట కొందరు ఇసుక తరలించుకుపోతున్నారు.

వినాయక ఆలయంలో పూజలు


అలంకరణలో వినాయకుడు

అక్కయ్యపాలెం, జూన్ 25 : నాలుగు లేన్ల రహదారి ఆంధ్రజ్యోతి కార్యాలయం పక్కన ఉన్న లక్ష్మీ వినాయక ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. శైవాగమ సంప్రదాయంలో అర్చకుడు బాలానంద శివాచార్య స్వామి లక్ష్మీ వినాయక హోమం,పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సుబ్రహ్మణ్య శర్మ,జీఎస్టీ అధికారి పి. వేణుగోపాలరావు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే గణబాబు పరామర్శ


శంకరరావును పరామర్శిస్తున్న గణబాబు

ఆర్పీపేట, (కంచరపాలెం), జూన్ 26 : జీవీఎంసీ 56 వార్డు పరిధి 183 బూత్ టీడీపీ కన్వీనర్ నక్కా శంకరరావు పక్షవాతంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈనేపథ్యంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు మంగళవారం ఆయనను పరామర్శించి ఆరోగ్య స్థితిని అడిగితెలుసుకున్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి శంకరరావుకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు బి.రాజు రెడ్డి, నేతలు ఉన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

జగదాంబ కూడలి, జూన్ 25: వన్‌టౌన్ బురుజుపేట కనకమహాలక్ష్మికి మంగళవారం అష్టదళ పద్మారాధన సేవలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు 108 స్వర్ణ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య ఉభయదాతలచే పూజలు జరిపించారు.

కొనలేం, తినలేం

... 5వ పేజీ తరువాయి

బీన్స్ 120/150, చేమదుంపలు 44, క్యాప్సికమ్ రూ.84, కాకర 48, బీరకాయలు 40, పచ్చిమిర్చి రూ.64కు విక్రయిస్తున్నారు. అల్లం రూ.160, వెల్లుల్లి రూ.180. తరచూ వినియోగించే బంగాల దుంపలు రూ.32 కాగా ఉల్లిపాయల ధర రూ.36గా ఉంది. ప్రస్తుతానికి తక్కువ ధర ఏదైనా ఉందంటే ఆనపకాయే. కిలో రూ.22 ఉంది. కూరగాయల ధరలపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి అందుబాటులో ఉండేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఘనంగా వైభవ్ జ్యువెలర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు మనోజ్‌కుమార్ గ్రంధి జయంతి


మాట్లాడుతున్న 'వైభవ్' చైర్‌పర్సన్ భారత మల్లికారత్న కుమారి గ్రంధి

సీతంపేట, జూన్ 25: మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యువెలర్స్ లిమిటెడ్ (వైభవ్ జువెలర్స్) వ్యవస్థాపక అధ్యక్షులు, దివంగత మనోజ్ కుమార్ గ్రంధి 58వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం, ఆ సంస్థ పలు సంక్షేమ, సామాజిక కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో భాగంగా ఎఎస్ రాజా వలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 75 మందికిపైగా ఉద్యోగులు రక్తదానం చేశారు. లీహెల్త్ డొమైన్ (ఐ)ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలోహెల్త్ క్యాంప్, మ్యాక్సీవిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యం ఏర్పాటు చేశారు. పలువురికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎఎస్ రాజా వలంటరీ బ్లడ్ బ్యాంక్ ఎండీ డాక్టర్ సుగంధి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మనోజ్‌కుమార్ గ్రంధి మనోజ్ వైభవ్ జెమ్స్ అండ్ జ్యూయలర్స్ లిమిటెడ్ (వైభవ్ జ్యువెలర్స్)కే కాకుండా విశాఖ నగరంలో అనేక మంది వ్యాపారులకు స్ఫూర్తిదాయకంగా, మార్గదర్శకంగా నిలిచారని కొనియాడారు. అద్భుతమైన బంగారు ఆభరణాల డిజైన్‌లు, అత్యున్నత స్థాయిలో కస్టమర్లకు సేవలందిచారన్నారు. ఉద్యోగుల సత్‌ప్రవర్తన, స్నేహపూరిత వాతావరణంలో కొనుగోలుదారుల అభిమానం చూరగొనడం అభినందనీయమన్నారు. తమ అధినేత జయంతిని పురస్కరించుకుని ఎంతోమంది ప్రాణాలను కాపాడేలా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అలాగే, ఉద్యోగులకు ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించడం వైభవ్ జ్యువెలర్స్‌కు కార్పొరేట్ సామాజిక సేవలపై ఉన్న అంకితభావాన్ని తెలియజేస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్‌పర్సన్ భారత మల్లికారత్నకుమారి గ్రంధి, సంస్థ హోల్‌టైమ్ డైరెక్టర్ అండ్ సీఎఫ్‌వో సాయికీర్తన, సీవోవో రఖాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, వైభవ్ సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వెంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, జూన్ 25: కృష్ణా గార్డెన్స్ సమీపంలో ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శ్రీహరిసేవ అధ్యక్షులు ఎన్.అప్పారావు నేతృత్వంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీభూనీలా సమేతులైన శ్రీవారికి మంగళధ్వని, వేద మంత్రాలతో సాంప్రదాయ ప్రకారం శ్రీమాన్ పి.రంగనాథ ఆచార్యులు వారి బృందం ఈ వేడుకను నిర్వహించారు. టి. సుధాకర్‌రెడ్డి, రామనిర్మల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ఈ కల్యాణోత్సవానికి చేసిన వ్యాఖ్యానం ప్రత్యేకతను సంతరించుకుంది. భక్తి సంగీత సేవా సంస్థ శృతిలయ అధ్యక్షులు వి.ప్రభాకర్ వారి బృందం అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎంఎస్ మాధవ్, కొణతాల రాజు, నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

పాలనా సంస్కర్త పూర్వ కలెక్టర్ మల్లికార్జున

- వీడ్కోలు సభలో జిల్లా అధికారులు



ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ మల్లికార్జున

డాబాగార్డెన్స్, జూన్ 25: తన పరిపాలనా విధానాలతో పూర్వ జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున జిల్లా ప్రజల మనసు గెలుచుకున్నారని జిల్లా అధికారులు పేర్కొన్నారు. మంగళవారం దసపల్లా హోటల్‌లో బదిలీపై వెళ్లిన మల్లికార్జునకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మల్లికార్జున దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. జ్ఞాపికలు బహూకరించారు. ఆయనతో అధికారులు తమ అనుభవాలను పంచుకున్నారు. మల్లికార్జున కలెక్టర్‌గా ఆయన తనదైన శైలిలో పరిపాలనా సంస్కర్తగా గుర్తింపు పొందారన్నారు. వైద్య రంగాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. అనంతరం మల్లికార్జున మాట్లాడుతూ కలెక్టర్‌గా తన ఈ మూడేళ్ల పరిపాలనలో జిల్లా ప్రజలతో విడదీయరాని బంధం ఏర్పడిందన్నారు. పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు అనేక మందితో పనిచేశానని, ఎన్నో విషయాల్లో వారి అనుభవాలను పంచుకున్నట్టు గుర్తుచేశారు.తమలాంటి వారికి మల్లికార్జున ఆదర్శంగా నిలిచారని ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీ ఎ.రవిశంకర్, జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీఓలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసైతే భవిష్యత్తు నాశనం


మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నాయుడు

సీతమ్మధార, జూన్ 25: మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు నాశనమవుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జేవీఏ నాయుడు సూచించారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎన్ఎంసీ హెచ్ జీవీఎంసీ స్కూల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్‌స్పెక్టర్ జేవీఏ నాయుడు మాట్లాడుతూ ఎవరైనా మత్తుపదార్థాలు విక్రయించినా, విద్యార్థులను డ్రగ్స్ తీసుకునే విధంగా ప్రేరేపించినా తమ దృష్టికి, లేదా ఉపాధ్యాయుల దృష్టికి తేవాలన్నారు. మత్తు పదార్థాలను ప్రోత్సహించిన వారిపై తక్షణం చర్యలు తీసుకుంటమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ముసలనాయుడు, హెచ్‌సీ సత్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30న చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు

సీతమ్మధార, జూన్ 25: పిల్లలు, యువతకు పర్యావరణ పరిరక్షణ, జీవ కారుణ్యంపై అవగాహన కల్పిస్తూ ఇండియా యూత్ ఫర్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గాంధీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలుచేపట్టనున్నట్టు సంస్థల ప్రతినిధులు, పర్యావరణ ఇంజనీర్ పీవీ ముకుందరావు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 30న బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ పిల్లలకు చిత్రలేఖనం పోటీలు, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన ఇంటనేషనల్ ప్లాస్టిక్ ఫ్రీ డే అనే పోస్టర్‌ని ఇండియా యూత్ ఫర్ సొసైటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. 30వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల ఐదేళ్ల నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, విద్యార్థులు పోటీలో పాల్గొనాలని కోరారు. ఫోన్: 89780 19596లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సొసైటీ ప్రతినిధి అప్పలరెడ్డి తెలిపారు.

హయగ్రీవ భూ కేటాయింపులు రద్దు చేయాలి

- జనసేన నేత పీతల మూర్తియాదవ్


ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతి ఇస్తున్న మూర్తియాదవ్

మహారాణిపేట, జూన్ 25: హయగ్రీవ సంస్థకు భూ కేటాయింపులు రద్దు చేసి ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జనసేన నేత పీతల మూర్తియాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్‌ను కలిసి వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లా ఎండాడ గ్రామ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం భూమిని అనాథ, వృద్ధాశ్రమానికి మిగిలిన 90 శాతం భూమి వయోవృద్ధులకు మాత్రమే గృహ నిర్మాణాలు చేసి విక్రయించాలనే నిబంధనలతో 12.50 ఎకరాల కొండ పోరంబోకు స్థలాన్ని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థకు కేటాయించిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయటంలో ఆ సంస్థ విఫలం కావటంతో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని వెనక్కి తీసుకుందన్నారు. దీనిపై హయగ్రీవ సంస్థ కోర్టులో సవాలు చేయగా మూడేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేసుకోవాలని తీర్పు నిచ్చిందన్నారు. హయగ్రీవ సంస్థ ప్రభుత్వ ఉద్దేశాన్ని పక్కకు పెట్టి రియల్‌ఎస్టేట్ ప్రయోజనాల కోసం వినియోగించినట్టు మూర్తియాదవ్ ఆరోపించారు. దీనిపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలై, విచారణ జరుగుతోందన్నారు. అయినా, జీవీఎంసీ నుంచి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చారన్నారు. ఈ సంస్థ ప్రాజెక్టు పూర్తి చేయకుండా అక్రమ లావాదేవీలు జరిపిందన్నారు. ప్రాజెక్టు ఆశయాలు నెరవేర్చడంతో హయగ్రీవ సంస్థ విఫలమైనందున నిబంధనల ప్రకారం ఈ భూ కేటాయింపులు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

భక్తి శ్రద్ధలతో వెంకన్నకు పూజలు

సాగర్‌నగర్, జూన్ 25 : రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాలతో ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించి టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామివారికి పూజలు,అభిషేకాలు జరిపి భక్తులకు దర్శనాలు కల్పించారు. కాగా వచ్చేనెల 1 నుంచి శ్రీవారి సేవలో భక్తులు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే సుప్రభాత సేవకు ఒక వ్యక్తికి రూ. 100, పుష్పాలంకరణకు రూ. 12 వేలు. తోమాల సేవకు రూ. 200, సహస్ర నామార్చనకు రూ. 200 చెల్లించాలని చెప్పారు.

రేపటి నుంచి రాయితీ విత్తనాలు

భీమునిపట్నం, జూన్ 25 : నియోజకవర్గంలోని రైతులకు ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న విత్తనాలను గురువారం నుంచి పంపిణీ చేయనున్నట్టు భీమిలి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు బి. విజయప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం సాయంత్రం 4 గంటలకు భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ పంపిణీ ప్రారంభమవుతుందన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అందించే ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన పైడిమాంబ ఉత్సవం

ఆరిలోవ, జూన్ 25 : జీవీఎంసీ 13వ వార్డులోని రామకృష్ణాపురంలో పైడిమాంబ అమ్మవారి అనుపోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి భక్తులను దర్శనాలకు అనుమతించారు. మహిళలు పసుపు, కుంకుమ ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారి ఘటాలను ఊరేగించారు. అంబేడ్కర్ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు వంకర బాబూరావు, కాకార గోవింద్ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

నేడు భీమిలి మండల సమావేశం

భీమునిపట్నం, జూన్ 25 : మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరగనున్నట్టు ఎంపీడీవో జానకి తెలిపారు. ఎంపీపీ రాజు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. ఈమేరకు మంగళవారం ఆమె ప్రకటన విడుదల చేశారు.

రేపు ఆనందపురం...

ఆనందపురం : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్టు ఎంపీడీవో అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో జరగనున్న అభివృద్ధి పనులపై చర్చించనున్నట్టు చెప్పారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎండాడ, జూన్ 25 : దసపల్లా ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు సాగర్‌నగర్ ఏఈఈ ఎం. రాజేష్ తెలిపారు. మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గడ్డవానిపాలెం, సాగర్‌నగర్, ముసలయ్యపాలెం, భువనేశ్వరి కాలనీ, దసపల్లా లేఅవుట్, తాటిచెట్లపాలెం, లలితానగర్, సుభాష్‌నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

బీజేపీ నేత కుటుంబానికి పరామర్శ

ఆనందపురం, జూన్ 25 : మండలంలోని గొట్టిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకుడు బుత్తల రాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆ పార్టీ నాయకులు మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటుభుక్త రామానాయుడు, కో-కన్వీనర్ పసుపులేటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : శేరిఖండం గ్రామానికి చెందిన బీజేపీ మండల నాయకుడు వి. శ్రీరామమూర్తి కుటుంబానికి ఆ పార్టీ నాయకులు మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. శ్రీరామ్మూర్తి గత ఏడాది అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆయన కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు.

సినిమా గైడ్

- **మహారాజ :** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), తాతా సీతారామయ్య (పరవాడ), (తగరపువలస)
- **ప్రభుత్వ జూనియర్ కళాశాల :** రమాదేవి, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
- **మనమే :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **హరోం హర :** శ్రీరామ, శారద, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక)
- **హనీమూన్ ఎక్స్‌ప్రెస్ :** రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **ఒఎంజి :** శ్రీవెంకటేశ్వర, సంగం, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **భజే వాయు వేగం :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36,టమాటా 62, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 66, కాకరకాయలు 48, బీరకాయలు 40, ఆనపకాయలు 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజ్ 30, క్యారేట్ 38, దొండకాయలు 28, బంగాళా దుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 150, అల్లం (పాతది) 160, బరబటి 58, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 38, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 180, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 130, పొటల్స్ 34, కీరదోస 38, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 40, కంద 60, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 33, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 128
ఫారం ధర	-- 148
విత్ స్కిన్	-- 266
స్కిన్‌లెస్	-- 276

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

కంబాలకొండ పార్కులో అభివృద్ధి శూన్యం

ఆరిలోవ, జూన్ 25 : కంబాల కొండ ప్రకృతి సిద్ధమైన పార్కు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో సందర్శకులు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. తీరా, ఇక్కడకు వచ్చిన వారికి కూర్చునేందుకు కనీసం షెల్టర్లు లేవు. పార్కులో ఉన్న పలు పరికరాలు, షెల్టర్లు,వినోదాన్ని పంచే మంచెలు పూర్తిగా చెద పట్టి పాడైపోతున్నాయి. సందర్శకులు కూర్చునేందుకు వీలుగా కలపతో షెల్టర్లు ఏర్పాటు చేశారు. వాటికి రంగుల వేయకపోవడంతో చెద పడుతున్నాయ. దీంతో వాటిలో కూర్చోవడానికి భయాందోళన చెందుతున్నారు. సమీపంలో పుట్టలు అధికంగా ఉండడంతో పాముల భయం వెంటాడుతోంది. సందర్శకులు కొండను వీక్షించడానికి వీలుగా ఎత్తైన మంచెలు ఏర్పాటు చేశారు. అవి ఎక్కితే ఎక్కడ విరిగిపోతాయోనన్న స్థితిలో ఉన్నాయి. ఇలా అన్ని విధాలుగా పార్కు అభివృద్ధికి దూరంగా ఉంది. సదుపాయలు కానరాకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పర్యాటక శాఖాధికారులు స్పందించి పార్కులో కనీస సౌకర్యాలు కల్పించాలని సందర్శకులు కోరుతున్నారు.





పార్కులో చెద పట్టిన మంచెలు (ఇన్‌సెట్లో) విరిగి ఉన్న షెల్టరు

అతిసారపై అప్రమత్తం

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు
- పలు శాఖల అధికారులతో సమీక్ష

భీమునిపట్నం, జూన్ 25 : మండలంలో అతిసార (డయేరియా) వ్యాప్తి చెందకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ఎంవీపీ శ్రీనివాసరావు ఆదేశించారు.మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో డయేరియా నివారణపై అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా పైప్‌లైన్ల లీకులు, పాడైన పైపులు ఉంటే పరిశీలించి, చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అసిస్టెంట్ ఇంజనీరు భాస్కర్‌ను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పర్యటించి మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు పరిశుభ్రంగా వున్నాయా లేదా అన్నది పరిశీలించాలన్నారు. అవసరమైన ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఎక్కడా చెత్త లేకుండా చూడాలని చెప్పారు. వాడుక నీరు, మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్‌ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు,పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అతిసార, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్కడైనా ఆయా వ్యాధులు సోకినట్టు తెలిసిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జానకి, పంచాయతీ విస్తరణాధికారి అప్పలరాజు, భీమిలి ఐసీడీఎస్ సీడీపీవో ఎం. శ్రీదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు



సీడీని ఆవిష్కరిస్తున్న ఈఓ శ్రీనివాసమూర్తి

అప్పన్న కీర్తనల సీడీ ఆవిష్కరణ

సింహాచలం, జూన్ 25 : వరాహలక్ష్మీనారసింహుని మహిమలను లోకానికి చాటి చెప్పే లక్ష్యంతో అన్నమయ్య కీర్తనల బాణీలో అప్పన్న స్వామిపై తొలుతగా ఆరు కీర్తనలు రాసినట్టు రచయిత, జగత్కల్యాణ పీఠం అధ్యక్షుడు కొరుపోలు కనక వెంకటదాసు తెలిపారు. సింహాద్రినాథునిపై రాసిన కీర్తనల సీడీని మంగళవారం కొండదిగువ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి,స్థానాచార్యులు రాజగోపాల్ ఆవిష్కరించారు. ఈ కీర్తనలకు ప్రముఖ ఆధ్యాత్మిక పాటల స్వరకర్త పారుపల్లి రంగనాథ్ సంగీతం సమకూర్చారు. ఈ సందర్భంగా శేఖరమంత్రి ప్రభాకరరావు స్వామిపై ఒక కీర్తన ఆలపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ బండారు రాంబాబు, ఆచార్య కేవీఎస్ మూర్తి, మరడాన నాగేశ్వరరావు, రచయిత ఇందూ రమణ, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరి ఘాట్ రోడ్డులో సూచిక బోర్డులు

సింహాచలం, జూన్ 25 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి ముడసర్లోవ మార్గంలో వచ్చే భక్తుల సౌకర్యార్థం రెండవ ఘాట్ రోడ్డు ప్రారంభంలో దేవస్థానం అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.దీనివల్ల అడివివరం కూడలి, ముడసర్లోవ రోడ్డులో వచ్చే వాహనదారులకు సింహగిరికి వెళ్లే మార్గం సులభంగా తెలుస్తుంది. దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి ఆలోచనల మేరకు వీటిని ఏర్పాటు చేసినట్టు ఈఈ బి. రాంబాబు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

తగరపువలస, జూన్ 25 : బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ ఎస్ఐ సీహెచ్ చిరంజీవి ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డుపై నడిచేటప్పుడు, వాహనాలపై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జీబ్రా లైన్లు ఎలా దాటాలి, హెల్మెట్ ఏవిధంగా ధరించాలి, మైనర్లు ఎందుకు వాహనాలు నడపరాదన్న విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్. అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలోనే సంతృప్తి



ప్రతిభ చూపిన విద్యార్థులతో విజయ్‌బాబు, అహ్మద్

కొమ్మాది, జూన్ 24 : సామాజిక సేవలోనే సంతృప్తి ఉంటుందని భీమిలి టీడీపీ నాయకుడు చిక్కాల విజయ్‌బాబు అన్నారు. మంగళవారం కొమ్మాది దరి వల్లీనగర్‌లోని ముఖ్తియార్ హజరత్ ఆలీ ఆశ్రమం ట్రస్టు వార్షికోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులను ఆదుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ట్రస్టు అధ్యక్షుడు అహ్మద్‌తో కలిసి ఆయన నగదు ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం ట్రస్టు సభ్యులు విజయ్‌బాబును సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరె గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు

పద్మనాభం (రూరల్), జూన్ 25 : పొట్నూరు పంచాయతీ పరిధిలో ఉన్న గోస్తనీ నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ప్రభుత్వం మారినప్పటికీ వైసీపీ నాయకులు ఇసుక దందా ఆపడం లేదు. రాత్రి, పగలు తేడా లేకుండా ఎడ్లు బళ్ల ద్వారా ఇసుక తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. పొలాల సమీపంలో ఇసుక జేసీబీలతో డంప్ చేసి అక్కడి నుంచి రాత్రి వేళ లారీలు, ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఈ దందా కొనసాగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.



హోం మంత్రి అనితతో 98వ వార్డు నాయకులు

హోం మంత్రి అనితను కలిసిన టీడీపీ నాయకులు

సింహాచలం, జూన్ 25 : రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనితను 98వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు మంగళవారం పాయకరావుపేటలోని ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఐటీడీపీ విశాఖ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాశర్ల తరుణ్ ఆదిత్య, 232 బూత్ ఇన్‌చార్జి మజ్జి చంద్ర శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు, ఫణి మనోహర్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం



మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చిన్నంనాయుడు

భీమునిపట్నం, జూన్ 25 : మాదక ద్రవ్యాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలు, దుష్పరిణామాలపై భీమిలి ఎస్ఈబీ ఎస్ఐ పి. చిన్నంనాయుడు విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఎన్‌డీపీఎస్ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు మత్తు పదార్థాల సేవించడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పొన్నగంటి రమణ, ఉపాధ్యాయులు నానాజీ, కానిస్టేబుళ్లు వీరభద్రరావు, దేముడురాజు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, జూన్ 25 : వరాహలక్ష్మీనృసింహస్వామికి మంగళవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు జరిపి షోడశోపచారాలు సమర్పించారు. తొలుత నృసింహ సహస్రనామావళి పఠిస్తూ సహస్రనామ తులసీ దళార్చన చేశారు. తరువాత గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనం మీద అధిష్ఠింపజేసి ఉపచారాలు సమర్పించి నృసింహ అష్టోత్తర శతనామార్చన జరిపారు. తరువాత ఉదయం 9.30 గంటలకు పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

బీజామృతంతో సామూహిక విత్తన శుద్ధి



రైతులతో విత్తన శుద్ధి చేయిస్తున్న వ్యవసాయాధికారి బాలామణి

పద్మనాభం, జూన్ 25 : మండలంలోని పొట్నూరు గ్రామంలో సేంద్రియ వ్యవసాయంలో భాగంగా ఖరీఫ్ సీజన్‌లో వేసే వరి విత్తనాలను రైతులు బీజామృతంతో సామూహికంగా శుద్ధి చేశారు. ఈ సందర్భంగా సేంద్రియ సాగు యాజమాన్యం కోఆర్డినేటరు బాలామణి మాట్లాడుతూ బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వల్ల పంటలకు ఎటువంటి పురుగులు, తెగుళ్ల ఆశించవని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తోనంగి అప్పలనాయుడు, వెంకటరావు, సత్యనారాయణ, ఎర్నాయుడు, సీఆర్‌పీ మీనా పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలపై దర్యాప్తు జరపాలి : కార్పొరేటర్ మంగమ్మ



మధురవాడ, జూన్ 25 : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మానం ఆంజనేయనగర్‌లో కొందరు నకిలీ ఇళ్ల పట్టాలతో ఇళ్లు నిర్మించుకున్నారని, దానిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని ఆ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ కోరారు. మంగళవారం ఆమె పిలకవానిపాలెంలో విలేకరులతో మాట్లాడారు. మధురవాడలో సర్వే నంబరు 125/పి,126/2లో 1998 అప్పటి ఎమ్మెల్యేలు మానం ఆంజనేయులు, పల్లా సింహాచలం నగరంపాలెం, మల్లయ్యపాలెంతో పాటు నగరంలోని కొంతమందికి కలిపి 350 పట్టాలు మంజూరు చేశారని చెప్పారు. అక్కడ స్థలం చదునుగా లేకపోవడంతో కొందరు వెంటనే ఇళ్లు నిర్మించుకోలేదని, ఇటీవల అక్కడ కొందరు నకిలీ పట్టాలతో ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. వాటికి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వడంపై తాము అభ్యంతరం వ్యక్తం చేశామన్నారు. అలాగే మానం ఆంజనేయ కాలనీలో పార్కు స్థలంలో శివాలయం నిర్మించారని, దీనిపై జీవీఎంసీ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేస్తానని చెప్పారు. కాలనీలో ఒక వ్యక్తి ఈ దందా నిర్వహిస్తున్నట్టు ఆరోపించారు. ఆమెతో పాటు టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు కూడా ఉన్నారు.

ప్లాంట్ పరిరక్షణే లక్ష్యం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జూన్ 25 : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను నాడు టీడీపీ ప్రభుత్వం కాపాడిందని, నేడు కూటమి ప్రభుత్వం కాపాడుతుందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అన్ని విధాలా అన్యాయం చేసిందని ఆరోపించారు. నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో నమ్మి సింహాద్రి, కనకరెడ్డి, అప్పారావు, శ్రీకాంత్, కిరణ్, పాల్గొన్నారు.

'శారదా పీఠం భూములను స్వాధీనం చేసుకోవాలి'

ఆరిలోవ, జూన్ 25 : శారదా పీఠానికి కేటాయించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు జె. రవి, జె. శ్రీరామ్మూర్తి కోరారు. మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖలోని శారదా పీఠానికి జగన్ ప్రభుత్వం రూ. 200 కోట్ల విలువైన భూములను కేవలం రూ.15 లక్షలకు ఇచ్చేసిందన్నారు. ప్రభుత్వం ఆ భూములను వెనక్కి తీసుకుని ప్రజా కార్యకలాపాలకు గాని, అణగారిన వర్గాల సంక్షేమానికి గాని ఉపయోగించాలని కోరారు. ఆశ్రమాల పేరుతో స్వామీజీలు భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.

అధ్వానంగా తర్లువాడ రోడ్డు



గోతులతో అధ్వానంగా ఉన్న రహదారి

ఆనందపురం, జూన్ 25 : మండలంలోని గుడిలోవ జాతీయ రహదారి నుంచి తర్లువాడ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో పాదచారులు,వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఫార్మసీ కళాశాల ఉండడంతో విద్యార్థులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారామ్ చొరవతో ఈ రోడ్డును నిర్మించారు. నాటి నుంచి నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. అడుగడుగునా గోతులు ఏర్పడడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆర్‌ఎంపీ వైద్యుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి నాయుడు

ఆనందపురం, జూన్ 25 : మండలంలోని పెద్దిపాలెంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో పద్మావతి డయగ్నొస్టిక్స్ సహకారంతో మంగళవారం వైద్య విద్యపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ హోమ్స్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ పద్మావతినాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలో ఆర్‌ఎంపీలదే కీలక పాత్ర అన్నారు. రాత్రనక, పగలనక గ్రామాలను కనిపెట్టుకుని తక్కువ ఖర్చుతో పేదలకు చికిత్స అందించడం అభినందనీయమన్నారు. ప్రముఖ వైద్యుడు ఎస్ఎల్ రావు మాట్లాడుతూ క్రమశిక్షణ కమిటీ ఏర్పాటు చేసి ఆర్‌ఎంపీలు పరిధి దాటకుండా వైద్యం చేసేలా వైద్య విజ్ఞానాన్ని అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్‌ఎంపీల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, గౌరవ సలహాదారుడు మమ్ముల తిరుపతిరావు, జోనల్ కార్యదర్శి ఎన్. సుగినేశ్వరి, కేన్సర్ ఫౌండేషన్ కార్యదర్శి కోనా ప్రకాశ్, కేఎస్ రావు పాల్గొన్నారు.

'విద్యార్థులకు ఉచిత విద్య అందించాలి'

భీమునిపట్నం, జూన్ 25 : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఎల్‌కేజీ నుంచి పిజి వరకూ ఉచిత విద్య అందించాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు, నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి భాగం గోపాలరావు కోరారు. మంగళవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండడంతో అక్కడి వరకూ చదువు సాగిస్తున్నారని, పిజి చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అమలులో ఉన్న 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిందని, వాటిని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ. 27 వేల కోట్లు అమ్మఒడి, విద్యాదీవెన పథకాలను మళ్లించారని, వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కలెక్టరుగా పనిచేసిన మల్లికార్జున హయాంలో ముదపాక నుంచి భీమిలిలోని నేరెళ్లవలస వరకూ ఎస్సీలకు చెందిన ప్రభుత్వ భూములు వైసీపీ నాయకుల పాలయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయని, వాటిపై కూడా దర్యాప్తు జరపాలన్నారు.

ఉద్యానవన పంటల సాగుపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

కొమ్మాది, జూన్ 25 : రైతులు నైపుణ్యంతో పంటలు పండించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె. సత్యనారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన కొమ్మాదిలోని రైతుబజార్‌లో రైతులకు ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ మండల అధికారి స్వాతి, త్రినాథ్, రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి పూజలు

వెంకోజీపాలెం, జూన్ 25 : జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్‌లో నెలకొల్పిన విజయదుర్గాదేవి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలతో సామూహిక కుంకుమార్చాన జరిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు శంకర్, కృష్ణమూర్తి, మహేష్, సత్తిబాబు పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

పద్మనాభం (రూరల్), జూన్ 25 : మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం గ్రామంలో సర్వే నెంబరు 317లో గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్నారని స్థానికులు తహసీల్దార్ వెంకటరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, ఆక్రణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.